PRABHATA SURYA

ప్రభాత సూర్య

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వెల రూ.5/ - పేజీలు : 8 బుధవారం 10 సెప్టెంబర్ 2025 సంపుటి: 01, సంచిక : 79

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ఐపీఓకు సిద్ధమవుతున్న ఎల్‌జీ ఇండియా

దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఎల్‌జీ ఈ ఏడాదిలోనే అతిపెద్ద ఐపీఓకు సిద్ధమవుతోంది. ఎల్‌జీ కంపెనీ తన ఇండియా యూనిట్ అయిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూను ప్రారంభించనుంది. స్టాక్ మార్కెట్ల నుంచి కంపెనీ సుమారు రూ. 15,000 కోట్ల వరకు నిధులను సమీకరించేం దుకు అక్టోబర్ మొదటివారంలో సబ్‌స్క్రిప్షన్ ప్రారంభిస్తుందని బ్యాంక్ వర్గాలు తెలిపాయి. అయితే, ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్న కారణంగా స్థిరమైన పరిస్థితుల కోసం కంపెనీ ఎదురుచూస్తోంది. ఇప్పటికే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఎల్‌జీ ఇండియా పబ్లిక్ ఇష్యూకు ఆమోదం తెలిపింది.


విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news


# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



- వరద బాధితులకు ప్రధాని నరేంద్ర మోదీ భరోసా
- హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లో పర్యటన
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- తక్షణ సాయం కింద హిమాచల్‌కు రూ.1,500 కోట్లు, పంజాబ్‌కు రూ.1,600 కోట్లు

3



## దోహాపై ఇజ్రాయెల్ బాంబులు

- ఇద్దరు హమాస్ నేతలు..ముగ్గురు అంగరక్షకుల మృతి
- మాదే బాధ్యత: నెతన్యాహు
- ఖండించిన సౌదీ, ఫ్రాన్స్
- బంకర్‌లోకి ఇరాన్ సుప్రీంలీడర్!

3

# మళ్లీ దిద్దాల్సిందే!

## గ్రూప్-1 మెయిన్స్‌పై తేల్చి చెప్పిన హైకోర్టు

- మార్చిలో ఇచ్చిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ రద్దు.. తుది మార్కుల జాబితా కూడా..
- జవాబు పత్రాలు మాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలి
- ఆ మేరకు ఫలితాలు ప్రకటించి పోస్టులు భర్తీ చేయాలి... మూల్యాంకనం సాధ్యం కాకుంటే మళ్లీ మెయిన్స్ పరీక్ష పెట్టండి
- ఈ ప్రక్రియంతా 8 నెలల్లో పూర్తవ్వాలి
- నోటిఫికేషన్, నిబంధనల మేరకు పరీక్ష జరగలేదు... కమిషన్ చర్యలు మెయిన్స్ పరీక్షల పవిత్రతను దెబ్బతీశాయి
- ఒకరి మార్కులు మరొకరికి తెలియకుండా చేయడం పారదర్శకతను దెబ్బతీస్తోందన్న న్యాయమూర్తి



**సూర్య హైదరాబాద్**

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను మళ్లీ దిద్దాల్సిందేనని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)కు హైకోర్టు తేల్చిచెప్పింది. మార్చి 10న వెలువరించిన తుది మార్కుల జాబితా, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను రద్దు చేసింది. గ్రూప్-1 మెయిన్స్‌కు సంబంధించిన అన్ని సమాధాన పత్రాలను మాన్యువల్‌గా తిరిగి మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని ఆదేశించింది. సంజయ్‌సింగ్ అండ్ అదర్స్ వర్సెస్ యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, అలహాబాద్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు మేరకు మోడరేషన్ పద్ధతిని వర్తింపజేయాలని స్పష్టం చేసింది. ఆ ఫలితాల - మిగతా2లో

# ఆగ్రహ జ్వాలలు



## నేపాల్‌లో మహోగ్రరూపం దాల్చిన ఆందోళనలు

## రెండోరోజూ రెచ్చిపోయిన విద్యార్థులు, యువత

- పోలీసులతో ఘర్షణ, హింసాత్మక ఘటనల్లో 22కు పెరిగిన మరణాలు
- పార్లమెంట్‌కు నిప్పుపెట్టిన ఆందోళనకారులు
- నైతిక బాధ్యతగా పదవీత్యాగం చేసిన ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ
- మంటల్లో కాలి చనిపోయిన మాజీ ప్రధాని ఖనాల్ సతీమణి
- నేపాల్‌తో సరిహద్దు వద్ద పహారాను కట్టుదిట్టంచేసిన భారత్
- కాఠ్మండు మేయర్ బాలెన్‌ను కొత్త ప్రధానిగా చేయాలన్న ఆందోళనకారులు
- కర్ఫ్యూలోనూ వీధులను కదనరంగంలా మార్చిన విద్యార్థులు
- రక్తమోడిన మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా దంపతులు
- అగ్నికి ఆహుతైన పలువురు నేతల ఇళ్లు.. ప్రధానకార్యాలయాలూ ధ్వంసం

3

## పీసీసీ అధ్యక్షుడే అప్రూవర్‌గా మారారు

- ఆ 10 మంది ఎమ్మెల్యేలు మా పార్టీలో చేరారని చెప్పారు
- స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**సూర్య హైదరాబాద్**

'ఆ పది మంది ఎమ్మెల్యేలు మా పార్టీ లో చేరారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మొన్న టీవీల్లో చెప్పారు. ఆయనే - మిగతా2లో



# కొత్త ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

## ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై ఘన విజయం

- తమిళనాడు నుంచి ఈ పదవిని చేపట్టనున్న మూడో నేతగా ఘనత
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు 452, సుదర్శన్‌రెడ్డికి 300 తొలి ప్రాధాన్యత ఓట్లు
- 152 ఓట్ల తేడాతో గెలుపొందిన ఎన్డీయే కూటమి అభ్యర్థి.... మొత్తం పోలైన ఓట్లు 767.. వాటిలో చెల్లనివి 15 ఓట్లు
- 98.20 శాతంగా నమోదైన పోలింగ్.. ఓటింగ్‌కు గైర్హాజరైన 13 మంది ఎంపీలు
- ఇండియా కూటమి నుంచి పలువురు ఎంపీల క్రాస్‌ఓటింగ్



**సూర్య న్యూఢిల్లీ**

దేశ 15వ ఉపరాష్ట్రపతిగా బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ) తరపున పోటీ చేసిన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై ఆయన ఘన విజయం సాధించారు. రాధాకృష్ణన్ 452 ఓట్లు సాధించగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 300 ఓట్లు పొందారు. దీంతో 152 ఓట్ల తేడాతో రాధాకృష్ణన్ గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ మంగళవారం రాత్రి ప్రకటించారు. దీంతో రాధాకృష్ణన్ త్వరలోనే ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం - మిగతా3లో

## ఆర్ఆర్ఆర్ ఉత్తరం పనులు ప్రారంభించండి

- హైదరాబాద్ బందర్ మధ్య 12 వరుసల కొత్త రోడ్డుకు అనుమతివ్వండి
- శ్రీశైలానికి 4వరుసల ఎలివేటెడ్ కారిడార్ కావాలి
- హైదరాబాద్-మంచిర్యాల మధ్య కొత్త రోడ్డు వేయాలి
- కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ వినతి
- 868 కోట్ల పనులకు వారంలో అనుమతిస్తాం.. కొత్త రోడ్లపై చర్చకు అధికారుల్ని పంపుతా: గడ్కరీ



**సూర్య హైదరాబాద్**

భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకా రం తెలంగాణ-ఏపీ రాజధానుల మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాల్సి ఉందని గుర్తుచేశారు. తెలంగాణకు సముద్రమార్గం లేనందున బందరు పోర్టు వరకు సరకు రవాణాకు వీలుగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారిలో 118 కిలోమీటర్లు తెలంగాణలో ఉంటుందని మిగతా భాగం ఏపీలో ఉంటుందని వివరించారు. - మిగతా2లో

## ఎన్డీయేది నైతికంగా పరాజయమే

- ఉప రాష్ట్రపతి ఎన్నిక ఫలితంపై ఖర్గే
- ఇది కేవలం ఎన్నిక మాత్రమే కాదు
- అంతకుమించిన సైద్ధాంతిక యుద్ధం
- ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు

3



# ఆగ్రహ జ్వాలలు




కాఠ్మండు/న్యూఢిల్లీ

సోషల్ మీడియా యాప్‌లపై నిషేధంతోపాటు విద్యార్థులు, యువత సోమవారం మొదలెట్టిన ఆందోళనలు మెరుపువేగంతో నేపాల్‌ను చుట్టేసి దేశాన్ని సంక్షోభ కుంపట్లోకి నెట్టేశాయి. సామాజిక మాధ్యమాల సేవలను పునరుద్ధరిస్తున్నామని కేపీ శర్మ ఓలీ సారథ్యంలోని ప్రభుత్వం కొద్ది గంటల్లోనే స్పష్టంచేసినా అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయింది. రాజధాని కాఠ్మండు మొదలు దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు, యువత తమ నిరసనజ్వాలలను మరింతగా ఎగదోస్తూ ఏకంగా పార్లమెంట్ భవనానికి నిప్పు పెట్టారు. మంగళవారం ఆందోళనలను అణచివేసేందుకు పోలీసులు, సైన్యం రంగంలోకి దిగాయి. కాళీమతిలో పోలీస్‌సర్కిల్‌కు నిప్పుపెట్టి అధికారులపై దాడి చేయడంతో పోలీసులు కాల్పులు జరిపారు. దీంతో ఇద్దరు చనిపోయారు. దీంతో కాల్పులు, పరస్పర ఘర్షణ ఘటనల్లో మరణాల సంఖ్య మంగళవారానికి 22కు పెరిగింది. 300 మందికిపైగా గాయపడ్డారు. కట్టలు తెంచుకున్న యువాగ్రహాన్ని తగ్గించే లక్ష్యంతో ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ మంగళవారం తన పదవికి రాజీనామాచేశారు. భద్రంగా ఇంటి నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నేపాల్ ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్దెల్‌ను బతిమాలుకున్నట్లు వార్తలొచ్చాయి. ఆందోళనకారుల నిరసన కార్యక్రమం అదుపుతప్పి మాజీ ప్రధానమంత్రి, తాజా మంత్రులపై భౌతికదాడులదాకా వెళ్లింది. ప్రధాని ఓలీకి చెందిన భక్తపూర్‌లోని బాల్కోట్ నివాసాన్ని ఆందోళనకారులు తగులబెట్టారు. మాజీ ప్రధానమంత్రి ఝలనాథ్ ఖనాల్ ఇంటికి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ మంటల్లో చిక్కుకుని ఆయన భార్య రాజ్యలక్ష్మి చిత్రకార్ తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన ఆమెను సమీప కీర్తిపూర్ బర్న్

**ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె ప్రాణాలు**

కోల్పోయారు. ఎటు చూసినా ఆస్తుల విధ్వంసం, వినాశనంతో నేపాల్ నిలువెల్లా రక్తమోడింది. దుకాణాల లూటీలు, పౌరుల భయాందోళనల నడుమ ప్రధాని రాజీనామాతో ఎట్టకేలకు సైన్యం పూర్తిస్థాయిలో రంగంలోకి దిగి శాంతభద్రతల పరిరక్షణ బాధ్యతలను తన చేతుల్లోకి తీసుకుంది. పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకుని ప్రజల ఆస్తులను ధ్వంసంచేస్తూ లూటీలకు తెగించిన వాళ్ల అంతుచూస్తామని ఆర్మీ చీఫ్ హెచ్చరించారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి, రాజకీయ వారసత్వం, సంపన్న, ఉన్నతస్థాయి వర్గాల ఆధిప్యంపై ఇప్పటికే విసిగిపోయిన యువత తాజాగా సామాజికమాధ్యమాలపై హఠాత్తుక నిషేధం విధించడంతో వాళ్లలో ఆగ్రహం పెల్లుబికి మహోద్యమంగా మారడంతో దేశ భవిష్యత్తు ఇప్పుడు అగమ్యగోచరంగా తయారైంది.

**పెల్లుబికిన ఆగ్రహం**

పరిస్థితిని మరింతగా కట్టుతప్పొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కర్ఫ్యూను విధించింది. అయినాసరే వేలాదిమంది విద్యార్థులు, యువత 'జెన్ జెడ్'కూటమిగా ఏర్పడి రాజధాని కాఠ్మండు మొదలు పట్టణాలదాకా విధ్వంసానికి తెగించారు. మాజీ ప్రధానమంత్రులు మొదలు తాజా కేబినెట్ మంత్రులు, కీలక నేతల దాకా ముఖ్యమైన వ్యక్తుల ఇళ్లకు నిప్పంటించారు. ప్రధాన రాజకీయ పార్టీల ప్రధాన కార్యాలయాలనూ ధ్వంసంచేశారు. కనిపించిన ప్రతి ఒక్క రాజకీయ నేతను చితకబాదారు. దేశాధ్యక్షుడు రాంచంద్ర పౌదెల్, మాజీ ప్రధాని పుష్పకమల్ దహాల్(ప్రచండ), ప్రస్తుత కమ్యూనికేషన్స్ మంత్రి పృథ్వీ సుబ్బా గురుంగ్, మాజీ హోం మంత్రి రమేశ్ లఖ్వార్, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాల ఇళ్లను నాశనంచేశారు. ఆందోళనలు కాఠ్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్నీ తాకాయి. దీంతో ముందుజాగ్రత్తగా అంతర్జాతీయ విమానసర్వీసులను రద్దుచేసి ఎయిర్‌పోర్ట్‌ను అధికారులు తాత్కాలికంగా మూసేశారు.

**ఎటుచూసినా విధ్వంసమే**

ఆందోళనలను ఏ దశలోనూ అడ్డుకోలేక పోలీసులు చేతులెత్తేయడంతో విద్యార్థులు, నిరసనకారుల విధ్వంసకాండ ఆకాశమే హద్దుగా సాగింది. పార్లమెంట్, దేశాధ్యక్షుని కార్యాలయం, ప్రధాని నివాసం, సుప్రీంకోర్టు భవనం, ప్రధాన రాజకీయ పార్టీల హెడ్‌ఆఫీస్‌లు, సీనియర్ నేతల ఇళ్లు, మీడియా కార్యాలయాలు ఇలా ప్రతి దేశంలోని కీలక భవంతులన్నీ ఆందోళనకారుల ఆగ్రహజ్వాలల బారినపడ్డాయి. డల్లూ ఏరియాలోని మాజీ ప్రదాని ఝలానాథ్ నివాసానికి నిప్పుపెట్టారు. కపన్ ప్రాంతంలోని నేపాలీ కాంగ్రెస్ నేత ఇంటిని తగులబెట్టారు. సింఘదర్బార్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయం భవనానికీ నిప్పుపెట్టారు. మహరాజ్‌గంజ్‌లోని అధ్యక్షకార్యాలయం, బలువతార్‌లో ప్రధాని అధికారి నివాసం సైతం నిప్పురవ్వల వర్షంలో కాలిపోయాయి. టిన్‌కునేలో కాంతిపూర్ టెలివిజన్ ఆఫీస్‌ను ధ్వంసంచేశారు. బుద్ధనీలకంఠ ప్రాంతంలోని మాజీ ప్రధాని షేర్‌బహదూర్ దేవ్‌బా ఇంట్లో చొరబడి దేవ్‌బా, భార్య అర్జు రాణాలను రక్తంకారేలా కొట్టారు. దీంతో ప్రాణభయంతో ఆయన పచ్చికబయళ్లకు పరుగులుపెట్టారు. విషయం తెల్సుకుని సైన్యం రంగంలోకి దిగి ఆయనను నిరసనకారుల బారినుంచి కాపాడింది. దేవ్‌బా కుమారుడు జైబీర్‌కు చెందిన కాఠ్మండులో హిల్టన్ ఐదునక్షత్రాల హోటల్‌కు, అర్జుకు చెందిన ఖుమల్తార్‌లోని ఉలెన్స్ పాఠశాలకు, తోఖాలో మాజీ ప్రధాని బాబూరామ్ భట్టారాయ్ ఇంటికి నిప్పుపెట్టారు. ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌదెల్‌ను వీధిలో పరుగెత్తించిమరీ చితక్కొట్టారు. వెనక నుంచి ఆయన్ను ఒకతను వీపుమీద ఎగిరి తన్నుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గోశాల, లూభూ, కాళీమతి పోలీస్‌పోస్ట్‌లకూ నిరసనకారులు నిప్పుపెట్టారు. కలాంకీ, కాళీమతి, తహచల్, బనేశ్వర్, సైకాప్, ఛియాసల్, ఛపగావ్, ఠేచో ఇలా ప్రతి ప్రాంతంలో పెను విధ్వంసం సృష్టించారు. టైర్లు తగలబెట్టి రోడ్లపై రాకపోకలను నిలిపేశారు. కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యాలయ భవనం ఎక్కి పార్టీ జెండాను చింపేశారు. పోఖ్రా పట్టణంలో ఆందోళనకారులు కారాగారం గోడలు బద్దలుకొట్టారు. దీంతో జైలులోని 900 మంది ఖైదీలు బయటకు పరుగులుతీశారు. కాఠ్మండూలోని నఖూ జైలుకూ ఇదే గతి పట్టింది. దీంతో ఇక్కడి ఖైదీలు విడుదలయ్యారు. వీరిలో మాజీ హోం మంత్రి రవి లమీచ్ఛానే సైతం ఉన్నారు. ఇదే అదనుగా కొన్ని అల్లరిమూకలు దుకాణాలను లూటీ చేశాయి.

**దిగిపోవాలని డిమాండ్ చేసి దింపేశారు**

మంగళవారం ఉదయం ప్రధాని కేపీ శర్మ ఓలీ కార్యాలయాన్ని చుట్టుముట్టిన వందలాది మంది ఆందోళనకారులు తర్వాత లోపలికి చొరబడి శర్మను వెంటనే గద్దె దిగాలని మొండిపట్టుపట్టారు. "కేపీ దొంగ, దేశాన్ని వీడిపో"అంటూ పెద్దగా నినాదాలు చేశారు. తప్పని పరిస్థితుల్లో వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు దేశాధ్యక్షుడు రాంచంద్రకు లేఖ రాశారు. "నేపాల్ అసాధారణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. పరిస్థితి కుదుటపడేందుకు రాజ్యాంగబద్ధంగా, రాజకీయంగా తగు పరిష్కారం కనుగొనేందుకు వీలుగా ప్రధాని పదవి నుంచి వైదొలుగుతున్నా"అని 73 ఏళ్ల సీనియర్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్(యునిఫైడ్ మార్క్సిస్ట్%–%లెనినిస్ట్) నేత శర్మ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

వెంటనే రాజీనామాను అధ్యక్షుడు ఆమోదించారు. అయితే నూతన మంత్రివర్గం ఏర్పడేదాకా ఆయనే ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగుతారని దేశాధ్యక్షుడు చెప్పారు. నేపాల్ కాంగ్రెస్ పార్టీ అండతో గత ఏడాది జూలైలో శర్మ నాలుగోసారి ప్రధాని పదవిని చేపట్టడం తెల్సిందే. శర్మ దిగిపోవాలని నేపాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గగన్ థాపా సైతం అంతకుముందే డిమాండ్‌చేశారు. చైనాతో సత్సంబంధాలు కొనసాగించే శర్మ తరచూ భారతవ్యతిరేక విధానాలను అవలంభించే నేతగా అప్రతిష్ఠ మూటగట్టుకున్నారు. గత షెడ్యూల్ ప్రకారం ఈనెలలోనే భారత్‌లో పర్యటించాల్సి ఉండగా ఆలోపే పదవీసన్యాసం చేశారు. అయితే శర్మ దేశాన్ని వీడి దుబాయ్‌కు వెళ్లనున్నారని, ఆయన కోసం రన్‌వే మీద హిమాలయ ఎయిర్‌లైన్స్ విమానాన్ని సిద్ధంగా ఉంచారని వార్తలొచ్చాయి.

**అగ్నికి ఆహుతవుతున్న ప్రధాని ఇల్లు**

బాణసంచా కాల్చి.. పారిపోకుండా ఆపి..

నేపాల్ నుంచి పారిపోయేందుకు నేతలకు హెలికాప్టర్ సేవలను అందిస్తోందన్న పుకార్లతో సిమ్రిక్ ఎయిర్‌లైన్స్ భవంతిని ఆందోళనకారులు తగలబెట్టారు. భైసెపతి మంత్రుల క్వార్టర్స్ నుంచి మంత్రులు విదేశాలకు హెలికాప్టర్లలో పారిపోతున్నారన్న వార్తలతో విద్యార్థులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఎయిర్‌పోర్ట్ రన్‌వేల సమీపంలో బాణసంచా, రాకెట్లు కాల్చారు. దీంతో ఆకాశంలో పొగచూరింది. డ్రోన్లు ఎగరేసి, పౌర లేజర్‌లైట్లు రన్‌వే వైపు ప్రసరింపజేసి విమాన రాకపోకలను అడ్డుకోవాలని ప్రజలకు ఆందోళనకారులు సోషల్‌మీడియా వేదికగా పిలుపునిచ్చారు. అయితే అప్పటికే కొన్ని హెలికాప్టర్లు అక్కడి నుంచి వెళ్లిపోయాయని వార్తలొచ్చాయి. కొందరు మంత్రులు, వీవీఐపీలు ఆర్మీ బ్యారెక్‌లలో తలదాచుకున్నారు.

**పార్లమెంట్‌ను రద్దుచేయండి: బాలెన్ షా**

యువతలో విపరీతమైన ఆదరణ ఉన్న కాఠ్మండు నగర మేయర్, 35 ఏళ్ల బాలేంద్ర షా మాత్రం వెంటనే పార్లమెంట్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. "నిరసనకారులు శాంతించాలి. విద్యార్థి బృందాలు తక్షణం ఆర్మీ చీఫ్‌తో చర్చలకు సంసిద్ధమవ్వాలి. అంతకుముందే పార్లమెంట్‌ను రద్దుచేయాలి"అని అన్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని, తాము ఎంపీలుగా రాజీనామా చేస్తామని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి చెందిన 21 మంది ఎంపీలు ప్రకటించారు. ఉద్యమానికి తమ పూర్తి మద్దతు తెలిపారు. తాను సైతం రాజీనామా చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ప్రదీప్ యాదవ్ చెప్పారు.

**చర్చించుకుందాం.. రండి**

ఆందోళనను విడనాటి చర్చలకు రావాలని జెన్ జెడ్ విద్యార్థి, యువలోకానికి దేశాధ్యక్షుడు రాంచంద్ర పౌదెల్ పిలుపునిచ్చారు. శాంతి, సుస్థిరతకు అందరం పాటుపడుతున్నామంటూ నేపాల్ ఆర్మీ చీఫ్ అశోక్‌రాజ్ సిగ్దెల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏక్ నారాయణ్ ఆర్యల్, హోం సెక్రటరీ గోకర్ణ దవాదీ, సాయుధ పోలీసు బలగాల చీఫ్ రాజు ఆర్యల్, ఐజీ చంద్ర కుబేర్, జాతీయ దర్యాప్తు విభాగ సారథి హుత్రాజ్ థాపా సంతకాలు చేసి ఒక సంయుక్త ప్రకటన విడుదలచేశారు.

అయితే 26 సోషల్‌మీడియా సైట్ల పునరుద్దరణతోపాటు వాక్ స్వాతంత్ర్యం, ప్రభుత్వ ఉద్యోగుల్లాగా రాజకీయనేతలకూ రిటైర్మెంట్ వయసును ప్రకటించాలని పలు డిమాండ్లను యువత ప్రభుత్వం ముందుంచింది. మంత్రులు, ఉన్నతవర్గాల కుటుంబాలే సకల సౌకర్యాలను పొందుతున్నాయని ఉద్యమకారులు సోషల్‌మీడియాలో ప్రచారాన్ని మొదలెట్టారు. పరిస్థితిని చక్కదిద్ది ప్రభుత్వం, ఆర్మీ దేశంలో మళ్లీ శాంతిని నెలకొల్పాలని నేపాల్‌లోని ఆస్ట్రేలియా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జపాన్, ద.కొరియా, బ్రిటన్, అమెరికా రాయబార కార్యాలయాలు సంయుక్త ప్రకటనలో అభ్యర్థించాయి. ఉద్యమాలు శాంతియుతంగా సాగాలని హింసాత్మక పథం పనికిరాదని ఐక్యరాజ్య సమితి సైతం హితవు పలికింది.

# చెదిరిపోతున్న కెనడా కలలు

కెనడాలో ఉన్నత విద్య అభ్యసించడానికి భారతీయ విద్యార్థులు అమితంగా ఆసక్తి చూపుతుంటారు. అయితే, వారి ఆశలను కెనడా ప్రభుత్వం నీరుగారుస్తోంది. ఈ ఏడాది ఇప్పటిదాకా 80 శాతం ఇండియన్ స్టూడెంట్ వీసా దరఖాస్తులను తిరస్కరించింది. గత పదేళ్ల కాలంలో ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) ఈ విషయం స్వయంగా వెల్లడించింది. భారతీయ విద్యార్థులే ఎక్కువగా ప్రభావితం అయినట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఆసియాతోపాటు ఆఫ్రికా దేశాల విద్యార్థుల వీసా దరఖాస్తులు అధికంగా తిరస్కరణకు గురయ్యాయి. వీసాలు సులభంగా లభించే పరిస్థితి లేకపోవడంతో కెనడా విద్యాసంస్థల్లో విదేశీయుల ప్రవేశాలు సైతం తగ్గిపోతున్నాయి. 2024లో 1.88 లక్షల మంది భారతీయ విద్యార్థులు కెనడా విద్యాసంస్థల్లో చేరారు. రెండేళ్ల క్రితం ఈ సంఖ్య 3.60 లక్షలకు పైగానే ఉండేది. భారతీయ విద్యార్థులు ఇప్పుడు జర్మనీపై దృష్టి పెడుతున్నారు. 2022లో కెనడాకు ప్రాధాన్యం ఇచ్చిన భారతీయుల విద్యార్థులు 18 శాతం ఉండగా, 2024లో అది 9 శాతానికి పడిపోయింది. జర్మనీకి వైపు ఆసక్తి చూపినవారి సంఖ్య గత ఏడాది 31 శాతంగా ఉంది.

**ఎందుకీ పరిస్థితి?**

అమెరికాలో విదేశీ విద్యార్థులపై పలు ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. విద్యార్థి వీసా నిబంధలను ప్రభుత్వం కఠినంగా మార్చింది. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు విధించింది. కెనడా సర్కార్ సైతం ఇదే బాటలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. దేశంలో ఇళ్ల కొరత వేధిస్తోంది. మౌలిక సదుపాయాలపై విపరీతమైన ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో విదేశీయుల రాకను అడ్డుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. స్థానిక రాజకీయాలకు ప్రభుత్వం తలవంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. విదేశీ విద్యార్థులపైనా ఆ ప్రభావం పడుతోంది. ఆర్థిక వనరులు బలీయంగా ఉన్న విద్యార్థులకే కెనడా వీసాలు లభించే అవకాశం ఉంది. లాంగ్వేజ్ టెస్టులోనూ మంచి ప్రతిభ చూపాల్సి ఉంటుంది. సమగ్రమైన స్టడీ ప్లాన్ సమర్పించాలి. అంతేకాకుండా రూల్స్ ఆఫ్ వర్క్‌ను సైతం కఠినంగా మార్చారు. చదువుకుంటూ ఖర్చుల కోసం పార్ట్‌టైమ్ జాబ్ చేయడం ఇక కష్టమేనని నిపుణులు చెబుతున్నారు.

**గమ్యస్థానం జర్మనీ**

ఈ ఏడాది విదేశీ విద్యార్థులకు 4,37,000 వీసాలు ఇవ్వాలని కెనడా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది గత ఏడాది కంటే 10 శాతం తక్కువ కావడం విశేషం. ఇందులో 73,000 వీసాలు పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 2,43,000 వీసాలు అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు నిర్దేశించారు. 1,20,000 వీసాలు రెన్యూవల్స్, పాఠశాల విద్యార్థులకు సంబంధించినవి. కెనడా వీసా చాలా ఖరీదైన అంశంగా మారిపోయింది. దరఖాస్తు, టెస్టులు, ఫీజులు తడిసిమోపెడవుతున్నాయి. ఒకసారి దరఖాస్తు తిరస్కరణకు గురైతే మళ్లీ దరఖాస్తు చేసుకోలేక చాలామంది వెనక్కి తగ్గుతున్నారు. మొత్తానికి కెనడా కలలు చెదిరిపోతున్నాయి. మరోవైపు విదేశీ విద్యార్థులపైనే ఆధారపడి మనుగడ సాగించే కెనడా కాలేజీలు, యూనివర్సిటీ పరిస్థితి దారుణంగా మారింది. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని కాలేజీలు ఇప్పటికే మూతపడ్డాయి. మరికొన్ని ఇతర కాలేజీల్లో విలీనమయ్యాయి. ఇదిలా ఉండగా, కెనడాకు ద్వారాలు మూసుకుపోతుండడంతో జర్మనీ విద్యాసంస్థల్లో చేరే భారతీయుల సంఖ్య పెరుగుతోంది. 2023లో 49,500 మంది చేరారు. 2025లో ఇప్పటికే 60,000 మంది ప్రవేశాలు పొందారు. జర్మనీలో టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ తదితర కీలక విభాగాల్లో తక్కువ ఫీజులకే మెరుగైన విద్య లభిస్తోంది. అమెరికా, కెనడాతో పోలిస్తే జర్మనీలో జీవన వ్యయం కూడా చాలా తక్కువ. ఈ అంశాలే జర్మనీని ఉన్నత విద్యకు గమస్థానంగా మారుస్తున్నాయి.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

ధర్మశాల/చండీగఢ్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. నీట మునిగిన పంట పొలాలు, ధ్వంసమైన ఇళ్లు, రహదారులను స్వయంగా పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలకు తోడు కొండచరియలు విరిగిపడడంతో తీవ్రంగా నష్టపోయిన హిమాచల్ ప్రదేశ్‌కు తక్షణ సాయం కింద రూ.1,500 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వరదల్లో మృతిచెందినవారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఏరియల్ సర్వే అనంతరం కాంగ్రా పట్టణంలో ప్రధాని మోదీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సహాయ పునరావాస చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖూ పాల్గొన్నారు. వరద బాధితులు సైతం హాజరై తమ గోడు వినిపించారు. తమను ఆదుకోవాలని ప్రధాని మోదీని వేడుకున్నారు. కచ్చితంగా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. వరదల్లో దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ధ్వంసమైన ఇళ్లను ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పునర్నిర్మించాలని సూచించారు. రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 20 నుంచి సెప్టెంబర్ 8 దాకా వరదలు, కొండచరియల కారణంగా ఏకంగా 370 మంది మృతిచెందారు.

**పంజాబ్‌లో సహాయక చర్యలపై ఆరా**

ప్రధాని మోదీ హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటన అనంతరం పంజాబ్‌కు చేరుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. బాధితులను కలిసి మాట్లాడారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతోనూ మాట్లాడారు. సహాయక చర్యలపై ఆరా తీశారు. గురుదాస్‌పూర్‌లో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. పంజాబ్‌కు తక్షణ సాయం కింద రూ.1,600 కోట్లు అందజేస్తామని ప్రకటించారు. భారీ వర్షాలతోపాటు సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగి ప్రవహించడంతో పంజాబ్‌లో భారీ నష్టం వాటిల్లింది. 51 మంది మరణించారు. 1.84 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. రూ.13,000 కోట్ల నష్టం జరిగినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. రూ.20,000 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రకటించాలని ప్రధాని మోదీని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది.

**చిన్నారి నీతికతో మోదీ**

హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రాలో సమీక్షా సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ 14 నెలల చిన్నారి నీతికను ఎత్తుకొని బుజ్జగించారు. ప్రకృతి విలయం వల్ల అనాథగా మారిన నీతిక దీనగాథ విని ఆయన చలించిపోయారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మండీ జిల్లాలోని తల్వార గ్రామంలో జూన్ 30న రాత్రిపూట హఠాత్తుగా భారీ వర్షం కురిసింది. గ్రామంపై కొండ చరియలు విరుచుకుపడ్డాయి. ఓ ఇంట్లో రమేశ్ కుమార్(31), రాధాదేవి(24) దంపతులు తమ కమార్తె నీతికతోపాటు తల్లి పూనమ్‌దేవితో కలిసి నిద్రిస్తున్నారు. ఇంట్లోకి బురద చొచ్చుకొచ్చింది. నీతికను వంట గదిలో పడుకోబెట్టి బురదను తొలగించేందుకు ముగ్గురూ ప్రయత్నించారు. ఇంతలో భారీ కొండచరియ ఆ ఇంటిపైకి దూసుకొచ్చింది. వంట గది మినహా ఆ ముగ్గురున్న గది నేలమట్టమైంది. రమేశ్ కుమార్, రాధాదేవి, పూనమ్‌దేవి బురదతోపాటు కొట్టుకుపోయి మృత్యువాత పడ్డారు. వంట గదికి నష్టం జరగకపోవడంతో నీతిక ప్రాణాలతో బయటపడింది. ఆ సమయంలో నీతిక వయసు 11 నెలలే. నీతికను హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం 'చైల్డ్ ఆఫ్ ద స్టేట్'గా ప్రకటించింది. ఆమె చదువుతోపాటు జీవనానికి అయ్యే ఖర్చులు భరిస్తామని ప్రకటించింది

## ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరం పనులు ప్రారంభించండి..

-మొదటిపేజీ తరువాయి

మంగళవారం కేంద్రమంత్రిని ఆయన నివాసంలో రేవంత్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల నిర్మాణం, అనుమతులు, పనుల వేగవంతం చేయాల్సిన అవసరంపై కేంద్రమంత్రితో చర్చించారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి 90శాతం భూసేకరణ పూర్తయిందని తెలిపారు. వెంటనే ఆర్థిక అనుమతి, కేంద్రమంత్రివర్గ అనుమతి ఇచ్చి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తరభాగం పనులతోనే దక్షిణభాగం పనులు కూడా చేపట్టాలని కోరారు. దీనికి సంబంధించిన అనుమతులు వేగంగా ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌ను ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీశైలంతో అనుసంధానించే మన్ననూర్–శ్రీశైలం రహదారి అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో ఉన్నందున నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికి తోడుగా ఓఆర్‌ఆర్ దగ్గర రావిర్యాల నుంచి ఆమనగల్ మీదుగా మన్ననూరు వరకు నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించాలని కోరా రు. అలాగే, హైదరాబాద్–మంచిర్యాల మధ్య ఉన్న రాజీవ్ రహదారిపై వాహన రద్దీ అధికంగా ఉన్నందున.. నూతన గ్రీన్‌ఫీల్డ్ రహదారిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఆర్‌ఐఎఫ్ కింద రూ.868 కోట్లతో ప్రతిపాదించిన రహదారుల పనులను మంజూరు చేయాలని కోరారు. ఈ వినతుల పట్ల నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. సీఆర్‌ఐఎఫ్ పనులకు వారం లోపు అనుమతులు ఇస్తామని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సంబంధించి తమ శాఖ అధికారులను హైదరాబాద్‌కు పంపుతానని హామీ ఇచ్చారు. ఈ అంశంపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో ఈ నెల 22న హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి తెలిపారు.

## పీసీసీ అధ్యక్షుడే అప్రూవర్‌గా మారారు

-మొదటిపేజీ తరువాయి

అప్రూవర్‌గా మారి.. నేరాంగీకారం తెలిపిన తర్వాత విచారణ ఎందుకు? చర్చ ఎందుకు? వారిపై వేటు వేసేందుకు స్పీకర్‌కు మొహమాటం ఎందుకు?'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు (కేటీఆర్) ప్రశ్నించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి భార్య శ్వేతారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలంలోని ఆవంచ గ్రామానికి వచ్చారు. శ్వేతారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. హరీశ్‌రావు తిరిగి హైదరాబాద్‌కు పయనమైన అనంతరం కేటీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ మారిన వారు ఏ పార్టీ లో ఉన్నారో చెప్పుకోలేని దురవస్థలో ఉన్నారన్నారు. స్పీకర్ నిర్ణయంలో తేడా ఉంటే.. టీపీసీసీ అధ్యక్షుడు మాట్లాడింది సుప్రీంకోర్టు ముందు పెడతామని స్పష్టం చేశారు.

**రాజకీయ లబ్ధికోసమే 'మేడిగడ్డ'..**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని.. రాజకీయ కక్షతో కేసీఆర్‌పై కేసు పెట్టేందుకు యత్నిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ప్రాజెక్ట్‌కు ఖర్చు చేసిందే రూ.94 వేల కోట్లు అని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ మామ పద్మారెడ్డి క్లియర్‌గా చెప్పారని.. అలాంటప్పుడు లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మేడిగడ్డలో 85 పిల్లర్లలో రెండు కుంగిపోతే అంతర్జాతీయ సమస్యగా చిత్రీకరించి.. రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

**'ఫార్ములా- ఈ' ఓ లొట్టపీసు కేసు..**

'నేను మళ్లీ చెప్తున్నా.. ఫార్ములా–ఈ ఒక లొట్టపీసు కేసు. ఈ అంశంలో ఎవరైనా వచ్చి నన్ను లై డిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చు'అని కేటీఆర్ సవాలు చేశారు. హైదరాబాద్‌కి ఫార్ములా– ఈ రేసును తీసుకురావడానికి తాను ప్రయత్నాలు చేశానని చెప్పారు. రేసు నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి రూ.46 కోట్లు ఇవ్వాలని తానే ఆదేశాలు ఇచ్చానని, డబ్బులు కూడా నిర్దేశిత ఖాతాలోకే చేరాయన్నారు. మంగళవారం నందినగర్ నివాసంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఫార్ములా ఈ రేస్ కేసులో ప్రతి రూపాయికి లెక్క ఉంది. ప్రాసిక్యూషన్ చేసినా, చార్జిషీట్లు వేసినా ఏమీ చేయలేరు'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మళ్లీ దిద్దాల్సిందే!

-మొదటిపేజీ తరువాయి
ఆధారంగా 563 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇది సాధ్యంకాని పక్షంలో గ్రూప్%–%1 మెయిన్స్ పరీక్ష రద్దు చేసి ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అందరికీ తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియంతా మంగళవారం నాటి ఉత్తర్వుల కాపీ అందిన రోజు నుంచి 8 నెలల్లో పూర్తి చేయాలంటూ కీలక తీర్పు వెలువరించింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్%–%1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని విచారించిన జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు సుదీర్ఘ వాదనల అనంతరం.. జూలై 7న తుది తీర్పు రిజర్వు చేశారు. తాజాగా మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించిన మొత్తం సమస్యను విధానపరమైన, మూల్యాంకన విధానం అనే రెండు కేటగిరీలుగా విభజించవచ్చునని న్యాయమూర్తి తెలిపారు. ఒక్కో కేటగిరీలోని అంశాల వారీగా తీర్పు ఇచ్చారు.

**1) విధానపరమైన అంశాలు..**

రెండు హాల్ టికెట్ల జారీ: 2024 ఫిబ్రవరి 19న టీజీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్‌లో రెండు హాల్‌టికెట్ల ప్రస్తావన ఎక్కడా లేదు. కానీ వేర్వేరు హాల్ టికెట్లు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. కమిషన్ వివరణ కూడా అస్పష్టంగా ఉంది. యూపీఎస్సీనే ఒక హాల్‌టికెట్ ఇస్తున్నప్పుడు.. ఇక్కడ రెండు ఎందుకనే దానిపై వివరణ నమ్మశక్యంగా లేదు. 2011లో ఇదే విధానం అనుసరించినట్లు కమిషన్ పేర్కొన్నా.. ఆ డాక్యుమెంట్లను సమర్పించలేదు. నోటిఫికేషన్ లేదా నిబంధనల మేరకు పరీక్ష జరగలేదని ఈ కోర్టు అభిప్రాయపడుతోంది.

కేంద్రాల కేటాయింపు: 18, 19 పరీక్షా కేంద్రాల్లో మహిళా అభ్యర్థులకే ప్రాధాన్యత ఎలా ఇచ్చారు. రాండమైజేషన్ విధానమే అయితే ఎక్కువ మంది మహిళా అభ్యర్థులను రెండు కేంద్రాలకే ఎలా కేటాయించారు? మహిళా అభ్యర్థులనే కేటాయించాలని కళాశాల అధికారులు చెప్పినట్లు కమిషన్ పేర్కొన్నా ఆధారాలను సమర్పించలేదు. అసలు అలా కేటాయింపులో ప్రాధాన్యత ఎందుకో కమిషన్ చెప్పలేదు. నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. మరోవైపు శారీరకంగా వికలాంగులైన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. నగరానికి దూరంగా 2వ, 3వ అంతస్తుల భవనాలను కేటాయించింది. ఇది కేంద్రాలను కేటాయించడంలో వివక్షను ప్రతిబింబిస్తోంది.

**హాజరులో అసమానత:**

మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్యను.. 21,093, 21,085, 21,110, 20,161గా ఇలా ఒక్కోసారి ఒక్కోలా పేర్కొంది. అభ్యర్థుల హాజరు నమోదులో కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రాజ్యాంగ సంస్థ ఇలా చేయడం ప్రశంసించలేం. తుది మార్కుల జాబితా విడుదల సమయంలో 21,085 మందిగా పేర్కొంది. సంఖ్యలో మార్పునకు ఎటువంటి వివరణ లేదు.

**బహుళ మూల్యాంకనం:**

జవాబు పత్రాల తొలి రెండు మూల్యాంకనాల్లో మార్చి 13 నాటి వెబ్ నోట్ ప్రకారం బార్‌కోడ్, బబ్లింగ్‌లున్నాయి. మూడో మూల్యాంకనంలో ఇవి లేవు. ఏపీలో నిర్వహించినట్లు ఇక్కడా చేశామని కమిషన్ చెప్పినా మూడో మూల్యాంకనం భిన్నంగా ఉండటంతో మార్కులను మార్చే అవకాశం ఉంది. నోటిఫికేషన్‌లో మూడో మూల్యాంకనంపై వివరాలు లేవు. కమిషన్ చర్యలు గ్రూప్%–%1 మెయిన్స్ పరీక్ష పవిత్రతను దెబ్బతీశాయి. మూల్యాంకన ప్రక్రియ పిటిషనర్ల వాదనలకు బలాన్ని చేకూర్చింది. వారి వాదన తోసిపుచ్చలేం.

**మార్కుల జాబితా ప్రచురణ:**

నిబంధనల ప్రకారం అభ్యర్థుల మార్కులను సబ్జెక్టుల వారీగా ప్రచురించాలి. అలా చేయకుండా కమిషన్ వ్యక్తిగత లాగిన్‌లకు సబ్జెక్టుల వారీగా పంపింది. అంటే ఎవరి మార్కులు వారికే కనిపిస్తాయి తప్ప.. ఇతరుల మార్కులు తెలియవు. ఇది సరికాదు. అందరి అభ్యర్థుల మార్కులతో జాబితాను ప్రచురించకపోవడం పారదర్శకతను దెబ్బతీస్తోంది. దీనిపై కమిషన్‌ను ప్రశ్నించే హక్కు అభ్యర్థులకు ఉంది.

**అర్హత సాధించని అభ్యర్థుల పేపర్ల మూల్యాంకనం:**

ఇంగ్లిష్ పరీక్షలో అర్హత సాధించిన తర్వాతే ఇతర పేపర్లు మూల్యాంకనం చేశామని కమిషన్ చెప్పింది. అయితే జనరల్ ఇంగ్లిష్‌లో అర్హత సాధించని వారి పేపర్లూ మూల్యాంకనం చేసినట్లు 12 మంది పేర్లు పరిశీలిస్తే తెలుస్తోంది. పరీక్ష నిర్వహణలో అసమగ్రతను ఇది స్పష్టం చేస్తోంది. దశాబ్దంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇది అశనిపాతం లాంటిది.

**ఖాళీలు పెంచడం:**

రెండో నోటిఫికేషన్ ద్వారా ఖాళీల సంఖ్య పెంచారు. మళ్లీ దరఖాస్తులు తీసుకున్నారు. అంతకుముందు దరఖాస్తు చేసుకోని వాళ్లు కూడా కొత్తగా రావడంతో అభ్యర్థుల సంఖ్య పెరిగింది. అయితే దీనిపై ఇప్పటికే ఇదే హైకోర్టు తీర్పునిచ్చింది. అందుకే ఈ అంశంపై విచారణకు నిరాకరించాం.

**2) మూల్యాంకన విధానం..**

మూల్యాంకనదారుల ఎంపిక:
రెగ్యులర్ అధ్యాపకులు, ఇద్దరు రిటైర్డ్ అధ్యాపక సభ్యులను మెయిన్స్ మూల్యాంకనానికి నియమించినట్లు కమిషన్ పేర్కొంది. వీరి పేర్లను రహస్యంగా ఉంచామని, పిటిషనర్లు బహిర్గతం చేసినందుకు చట్టప్రకారం చర్యలు తీసుకునే హక్కు ఉందని వాదించింది. అలాంటప్పుడు ఆ వివరాలిచ్చిన కమిషన్ ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకోవాలి. నోటిఫికేషన్ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే తీసుకోవాలన్నది పిటిషర్ల వాదన.
ప్రైవేట్ ట్యూటర్‌గా పనిచేసిన డాక్టర్ ఎం.ఎ.మాలిక్‌ను కూడా తీసుకున్నారని వారు తెలిపారు. ఇతను 22 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి సహా ఇతర పత్రికలకు పోటీ పరీక్షల కథనాలను అందిస్తున్నానని పేర్కొన్నారు. దీనిని అంగీకరించని కమిషన్ పిటిషనర్లపై కేసులు నమోదు చేస్తామని బెదిరించింది. అలాగే కమిషన్ రెగ్యులర్ ఫ్యాకల్టీ అనే దానికి అర్థాన్ని మార్చింది.

**పత్రాలు దిద్దిన విధానం:**

సమాధాన పత్రాల మూల్యాంకనానికి ఏదైనా విధానం ఉందా? కీ ఉందా? అని కమిషన్‌ను ప్రశ్నించాం. ఎటువంటి కీ లేదని, మూల్యాంకనదారులు సబ్జెక్ట్ నిపుణులని పేర్కొంది. తర్వాత కీ ఉందని సీల్డ్ కవర్‌లో సమర్పించింది. కీ విషయంలో కమిషన్ తన వాదనను ఎప్పటికప్పుడు మార్చింది. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనాలపై ఏదైనా కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టాలనుకుంటే సర్కార్‌ను సంప్రదించాలి. కానీ అలా జరగలేదని తెలుస్తోంది. కోర్టుకు సమర్పించిన కీలోనూ లోపాలున్నాయి.

# కొత్త ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

-మొదటిపేజీ తరువాయి
చేపట్టనున్నారు. తమిళనాడు నుంచి ఈ పదవిని అధిష్టించిన సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్.వెంకట్రామన్‌ల తర్వాత మూడో నాయకుడిగా సీపీ రాధాకృష్ణన్ చరిత్రకెక్కారు.

**ఘన విజయం...**

ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ నూతన పార్లమెంట్ భవనంలోని 'వసుధ ఎఫ్%–%101'లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. ఈ పోలింగ్‌లో మొత్తంగా 767 మంది ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం రాజ్యసభలో 6, లోక్‌సభలో ఒక ఖాళీ స్థానాన్ని పక్కనబెడితే లోక్‌సభలో 542 మంది, రాజ్యసభలో 239 మంది కలిపి 781 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. అయితే ముందే ప్రకటించినట్లుగా బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు ఎంపీలు, ఏడుగురు బీజేడీ ఎంపీలతోపాటు శిరోమణి అకాలీదళ్ ఎంపీ ఒకరు, స్వతంత్ర ఎంపీ సరబ్‌జీత్‌సింగ్ ఖల్సా ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. దీంతో మొత్తంగా 767 (98.2 శాతం) ఓట్లు పోలయ్యాయి. విజయానికి అవసరమైన ఓట్లను 377గా నిర్ణయించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్లను లెక్కించి రాత్రి 7:30 గంటలకు ఫలితాన్ని ప్రకటించారు. మొత్తం పోలైన 767 ఓట్లలో చెల్లని ఓట్లు 15 ఉండగా మిగిలిన 752 ఓట్లలో రాధాకృష్ణన్‌కు 452 మొదటి ప్రాధాన్యతా ఓట్లు లభించాయని.. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీసీ మోదీ ప్రకటించారు.

**అనుకున్నట్లే క్రాస్ ఓటింగ్**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అందరూ ఊహించినట్లే క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలిసింది. ఇండియా కూటమిలోని పక్షాలు, తమకు మద్దతుగా వచ్చిన ఆప్ సహా ఇతర చిన్నాచితక పార్టీలతో కలిసి కాంగ్రెస్ కనీసం 324 ఓట్లు వస్తాయని అంచనా వేసింది. పోలింగ్ జరుగుతున్న సమయంలోనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ప్రతిపక్షాలు ఐక్యంగా నిలబడ్డాయి. కూటమికి చెందిన 315 మంది ఎంపీల్లో అందరూ ఓటింగ్ కోసం హాజరయ్యారు'అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అయితే కాంగ్రెస్ పేర్కొన్నట్లుగానే 15 ఓట్లు క్రాస్ ఓటింగ్ అయ్యాయి. దీంతోపాటు చెల్లని ఓట్లు సైతం ఇండియా కూటమి పక్షాలవేనని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే 20%–%25 ఓట్లు ఎన్డీఏ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు రాధాకృష్ణన్‌కు ఎన్డీయే కూటమిలోని 427 మంది ఎంపీల మద్దతు ఉందని బీజేపీ కాగితంపై లెక్కలేసుకోగా పోలింగ్‌లో మాత్రం అంతకన్నా ఎక్కువగానే ఓట్లు లభించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో నిర్వహించిన సమర్థవంతమైన ఫ్లోర్ మేనేజ్‌మెంట్ కారణంగా ఎన్డీయే సునాయాశ విజయం సాధించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్డీఏ కూటమి పక్షాలకు రెండ్రోజులపాటు నిర్వహించిన శిక్షణా తరగతులు, మిత్రపక్షాలతో సమన్వయం, పోలింగ్‌కు ముందు ప్రాంతాలవారీగా ఎంపీలతో సమన్వయం రాధాకృష్ణన్ గెలుపునకు దోహదం చేసిందని చెబుతున్నారు.

**మిన్నంటిన సంబరాలు..**

సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించిన వెంటనే బీజేపీలో సంబరాలు మొదలయ్యాయి. కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషి నివాసం ముందు తమిళనాడు సంప్రదాయాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. సీపీ రాధాకృష్ణన్‌కు బీజేపీ ఎంపీలతోపాటు ఆయనకు మద్దతిచ్చిన పక్షాల ఎంపీలు శుభాకంక్షలు తెలిపారు.

**రాష్ట్రపతి, ప్రధాని, అమిత్ షా, ఖర్గే శుభాకాంక్షలు**

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర అమిత్ షా సహా పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టులు చేశారు. 'ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు అభినందనలు. ప్రజాజీవితంలో దశబ్దాల గొప్ప అనుభవం, దేశ పురోగతికి గణనీయంగా దోహదపతుంది. విజయవంతమైన, ప్రభావవంతమైన పదవీకాలం కోసం మీకు ఇవే నా శుభాకాంక్షలు'అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన సందేశాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'రాధాకృష్ణన్‌కు ఎంపీగా, వివిధ రాష్ట్రాల గవర్నర్‌గా గొప్ప అనుభవం ఉంది. ఆయన పార్లమెంటరీ జోక్యాలు ఎల్లప్పుడూ చురుకైనవి. గవర్నర్‌గా పదవీకాలంలో, సాధారణ పౌరులు ఎదుర్కొన్న సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి పెట్టారు. ఈ అనుభవాలు ఆయనకు శాసన, రాజ్యాంగ విషయాలపై అపార జ్ఞానం ఉందని నిర్ధారించాయి. ఆయన స్ఫూర్తిదాయకమైన ఉపరాష్ట్రపతి అవుతారని నాకు నమ్మకం ఉంది'ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాధాకృష్ణన్ నాయకత్వ లక్షణాలను, పరిపాలనపై ఆయనకున్న లోతైన జ్ఞానాన్ని అమిత్ షా ప్రశంసించారు. రాధాకృష్ణన్ అనుభవం, అట్టడుగు స్థాయి నేపథ్యం దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, అణగారిన వర్గాలకు సేవ చేయడానికి సహాయపడతాయని షా విశ్వాసం వ్యక్తం చేశారు. ఎగువ సభ సంరక్షకుడిగా ఆయన కొత్త పాత్రలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి పెదవివిప్పని జగ్‌దీప్ ధన్‌ఖడ్.. సీపీ రాధాకృష్ణన్ విజయం నేపథ్యంలో తొలిసారి స్పందించారు. ప్రజాజీవితంలో రాధాకృష్ణన్‌కు ఉన్న అపార అనుభవంతో ఉపరాష్ట్రపతి కార్యాలయం మరింత ఖ్యాతిని పొందుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు లేఖ రాశారు.

**ఒత్తిళ్లకు లొంగరని ఆశిస్తున్నాం: ఖర్గే**

'ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు. ఇండియా కూటమి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డి పోరాటానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. రాధాకృష్ణన్ పార్లమెంటరీ సంప్రదాయాల అత్యున్నత నైతికతను నిలబెట్టుకుంటారని, ప్రతిపక్షాలకు గౌరవాన్ని ఇస్తారని, ఒత్తిళ్లకు లొంగరని ఆశిస్తున్నా. వర్షాకాల సమావేశాల్లో జగదీప్ ధన్‌ఖడ్ అకస్మాత్తుగా రాజీనామా చేశారు, ఇది ఎందుకు అనేది ఎప్పటికీ వివరించలేం. రాజ్యాంగ స్థానాల పట్ల గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది'అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

## దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదు

-మొదటిపేజీ తరువాయి
కోర్టులో హాజరుపరిచారు. విజయవాడ, గుంటూరు కారాగారాల్లో రిమాండ్‌లో ఉన్న రాజ్ కెసిరెడ్డి, చాణక్య, సజ్జల శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలను బందోబస్తు మధ్య కోర్టుకు తీసుకొచ్చారు. బెయిల్‌పై విడుదలైన నలుగురు నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, పైలా దిలీప్‌లు కూడా కోర్టుకు హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి కోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో రాలేదు. ఆయన మినహా మిగిలిన 11 మందీ వచ్చారు. ఈ సందర్భంగా కోర్టులో ప్రాసిక్యూషన్స్ జేడీ.. నిందితులకు రిమాండ్ పొడిగించాలని మెమో వేశారు. దీనిని వ్యతిరేకిస్తూ నిందితుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారు. అరెస్టయి 90 రోజులు దాటిన నిందితులకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని వాదించారు. ఈ కేసులో ఇటీవల విడుదలైన ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీలకు మంజూరు చేసిన డిఫాల్ట్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సిట్ అధికారులు హైకోర్టులో పిటిషన్ వేశారు. తదుపరి విచారణ ఈ నెల 11న ఉందని ఏసీబీ కోర్టు దృష్టికి ప్రాసిక్యూషన్స్ జేడీ తీసుకెళ్లారు. దీంతో నిందితుల రిమాండ్‌ను 12వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

**బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా**

సజ్జల శ్రీధర్‌రెడ్డి సోమవారం వేసిన బెయిల్ పిటిషన్‌ను సాంకేతిక కారణాలతో తిరస్కరించారు. తిరిగి మంగళవారం కోర్టులో దాఖలు చేశారు. దీని విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ కౌంటర్ దాఖలుకు ఈ నెల 12వ తేదీకి వాయిదా పడింది. చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెయిల్ పిటిషన్‌ను వాదనల కోసం 12వ తేదీకి వాయిదా వేశారు. చాణక్య దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌పై సిట్ అధికారులు మంగళవారం కౌంటర్ దాఖలు చేశారు. విచారణను కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. వెంకటేశ్ నాయుడి నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్ లాక్ తీసేందుకు అనుమతించాలని కోరుతూ సిట్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్‌పై అభ్యంతరాలు తెలుపుతూ నిందితుల తరఫు న్యాయవాదులు కౌంటర్ వేశారు. పిటిషన్‌పై తదుపరి విచారణను 12వ తేదీకి వాయిదా వేశారు.

## దోమల నిర్మూలనకు మలాథియాన్ పిచికారీ



**గన్నవరం**

మండల పరిధిలోని బుద్దవరం పంచాయతీలో దోమల నియంత్రణకు మలాథియాన్ మందును పిచికారి చేసే కార్యక్రమాన్ని మంగళవారం సర్పంచ్ బడుగు బాలమ్మ, పాలకేంద్రం అధ్యక్షులు జి. నరేంద్ర ప్రారంభించారు. రమణమ్మ చెరువు, దళిత వాడ ఏరియాలో మురుగు కాలువలతో పాటు ఖాళీగా ఉన్న స్థలాల్లో పెరిగిన మొక్కల్లోనూ, ప్రభుత్వ హాస్టళ్లు స్కూళ్లలోనూ దోమల నిర్మూలన కోసం మందును చల్లించారు. ఈ సందర్భంగా బాలమ్మ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న దాదాజీ గూడెం, రాజీవ్ కాలనీ, పామర్తి నగర్ సెంటర్, బుద్దవరం ఏరియాలో పూర్తిగా దోమల మందు పిచికారి చేస్తామని చెప్పారు. మురుగు కాలవల్లో నీరు నిలబడకుండా డ్రైన్లను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దొరబాబు, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, సిబ్బంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

## దోహాపై ఇజ్రాయెల్ బాంబులు



**టెల్అవీవ్**


రాజధాని దోహాలో ఉన్న హమాస్ తిరుగుబాటుదారులే లక్ష్యంగా ఇజ్రాయెల్ మంగళవారం "ఆపరేషన్ జడ్జిమెంట్ అసెంబ్లీ" పేరుతో బాంబు దాడులు చేసింది. నగరంలోని ఖతారా జిల్లా పరిధిలో పలు చోట్ల పేలుళ్లు సంభవించాయని, ఆకాశంలో దట్టమైన పొగలు అలుముకున్నాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. హమాస్ సీనియర్ నాయకులను గురిపెట్టి, ఈ దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస(ఐడీఎఫ్) తెలిపింది. ఈ దాడుల్లో హమాస్ నేతలు ఖలీల్–అల్–ఖాయా, ఖాలెద్ మషాల్‌తోపాటు.. వారి అంగరక్షకులు ముగ్గురు చనిపోయారని భావిస్తున్నట్లు పేర్కొంది. "సామాన్య పౌరులకు ఎలాంటి నష్టం జరగకుండా.. అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాం. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్ పౌరులపై హమాస్ దాడి జరిపింది. ఆ దృశ్యాలను టీవీల్లో చూస్తూ.. 'థాంక్స్ గివింగ్ ప్రేయర్స్' చేసిన వారిలో ఖలీల్, ఖాలెద్ ఉన్నారు" అని వెల్లడించింది. గాజాలోనూ మంగళవారం ఏడు టవర్లను లక్ష్యంగా చేసుకుని, జరిపిన దాడుల్లో హమాస్ నేతలు చనిపోయినట్లు తెలిపింది. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సైతం దోహా దాడులకు తమదే బాధ్యత అని ప్రకటించారు. ఈ దాడులను ఫ్రాన్స్, సౌదీ అరేబియా ఖండించాయి. సౌదీ యువరాజు సల్మాన్ ఇజ్రాయెల్ చర్యను అంతర్జాతీయ నేరంగా పేర్కొంటూ.. ఖతార్‌కు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కాల్పుల విరమణ దిశలో ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం..!

## ఎన్డీయేది నైతికంగా పరాజయమే

**న్యూఢిల్లీ**

ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్‌డీఏ సంఖ్యాపరంగా గెలిచినా నైతికంగా, రాజకీయంగా మాత్రం ఓటమి పాలైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున ఖర్గే విమర్శించారు. ఇది కేవలం ఎన్నిక మాత్రమే కాదని, అంతకుమించిన సైద్ధాంతిక యుద్ధమని పేర్కొన్నారు. ఈ ఎన్నికలో ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా నిలబడ్డాయన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అత్యున్నత పార్లమెంటరీ సంప్రదాయాలు పాటిస్తారని, ప్రతిపక్షానికి సమాన గౌరవం, అవకాశం ఇస్తారని, అధికార పక్షం ఒత్తిళ్లకు తలొగ్గరని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## 'వరుస విజయాల వెనుక రహస్యమేంటి?'



**అమరావతి**

రాష్ట్ర మంత్రి లోకేశ్ తన దిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో 15 నెలలుగా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయనకు వివరించారు. పాటిల్ పోటీ చేసిన తొలి ఎన్నిక నుంచి వరుసగా నాలుగుసార్లు మెజార్టీ పెంచుకుంటూ వెళ్తుండటంపై లోకేశ్ ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా వారి మధ్య జరిగిన చర్చలో.. ఇంతగా ప్రజల అభిమానాన్ని చూరగొనడం వెనుకున్న విజయ రహస్యమేంటని లోకేశ్ అడిగినట్లు తెలిసింది. దీనికి పాటిల్ స్పందిస్తూ...నిరంతరం ప్రజలతో మమేకమవుతు, వారితో ఉండటమేనని తెలిపారు. తన నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలనూ లోకేశ్‌తో పంచుకున్నట్లు తెలిసింది

# అద్భుత ప్రతిభాశాలి కవి సమ్రాట్



తెలుగువారికి తొలి జ్ఞానపీఠాన్ని అందించిన బహుముఖ ప్రజ్ఞులు కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాథ వారి ఏ రచన అయినా సరే భారతీయ ఆత్మను, జీవుని వేదనను ప్రతిబింబించేదే. ప్రతీ అక్షరంలోను అసాధారణ ఊహాశక్తిని, అద్భుత రచనాశైలిని నింపి పాఠకుల హృదయాలలోకి పరుగులెత్తించ గలిగిన శక్తి ఆయన సొంతం. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో విశ్వనాథ వారు స్పృశించని ప్రక్రియ లేదు. తన రచనల ద్వారా కులాతీత, మతాతీత విధానాలను ఎండగట్టారు. ఆధునిక తెలుగు రచయితల్లో ఆయన పేరు లేకుండా తెలుగు సాహిత్య చరిత్ర గురించి వివరించడం అసాధ్యం. విశ్వనాథ 1895, సెప్టెంబరు 10న కృష్ణా జిల్లా నందమూరు గ్రామంలో జన్మించాడు. తండ్రి శోభనాద్రి, తల్లి పార్వతమ్మ. ఈయన భార్య వరలక్ష్మమ్మ. విద్యాభ్యాసము నందమూరు, ఇందుపల్లి, మరియు పెదపాడు గ్రామాల్లోను, పై చదువులు బందరు పట్టణంలోను సాగాయి. బందరు హైస్కూలులో తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి తెలుగు ఉపాధ్యాయునిగా లభించడం ఆయన అదృష్టం. బి.ఎ. తరువాత విశ్వనాథ బందరు హైస్కూలులోనే ఉపాధ్యాయునిగా చేరాడు. ఉద్యోగం చేస్తూనే మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఎ. పట్టా సాధించాడు. తరువాతి కాలంలో ఈయన వివిధ కళాశాలల్లో అధ్యాపక పదవులు నిర్వహించాడు. బందరు నేషనల్ కాలేజి (1928), గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజి (ఏసీ కాలేజీ) (1938 వరకు), విజయవాడ లో ఎస్.ఆర్.ఆర్.%ఢ?% సి.వి.ఆర్. కాలేజి (1938–1959), కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్ %ఢ% సైన్స్ కాలేజి (1959) మొదలైన కళాశాలల్లో ఆయన పని చేసాడు. 1957 లో విశ్వనాథ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడుగానూ, 1958లో విధానమండలికి నామినేటెడ్ సభ్యుడుగానూ పని చేశాడు. మహాత్మా గాంధీ నడుపుతున్న సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం కోసం ఉద్యోగాన్ని వదులు కున్నాడు. 1916 లో "విశ్వేశ్వర శతకము" తో విశ్వనాథ రచనా ప్రస్థానము ప్రారంభ మైనది. అప్పటి జాతీయోద్యమ ప్రభావంతో ఆ సమయంలోనే "ఆంధ్ర పౌరుషము" రచించాడు. 1920 నాటికే తెలుగులో ప్రసిద్ధ కవిగా గుర్తింపు తెచ్చు కొన్నాడు. 1961 లో కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో ప్రాచార్యునిగా పదవీ విరమణ చేసిన తరువాత పూర్తి స్థాయిలో తన సమయాన్ని సాహితీ వ్యాసాంగానికే కేటాయించాడు. తరువాత విశ్వనాథ రచనా పరంపర పుంఖానుపుంఖాలుగా కొనసాగింది. 25 పైచిలుకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయ కావ్యాలు, 15 నాటకాలు, 88 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శన గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు, ఉపన్యాసాలు... తెలుగుభాషకు విశ్వనాథ ఎనలేని సేవలు అందించాడు. ఆయన రచనలను కొన్ని ఇతర భాషలలోకి అనువదించారు. రేడియో కోసం నాటకాలు, ప్రసంగాలు రూపొందించాడు.విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినవి... ఆంధ్ర పౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో ఆయన పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన, వ్యక్తిత్వం అద్భుతంగా కనిపిస్తుంటాయి. తన రచనలలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం (జ్ఞానపీఠ అవార్డు లభించినది) తనకు వ్యక్తిగతంగా ఎంతో తృప్తినిచ్చిందని అంటుండే వాడు. ఎందరో కవులు వ్రాసినా మళ్ళీ ఎందుకు వ్రాయాలంటే రోజూ తింటున్నామని అన్నం తినడం మానివేయడం లేదుగదా అన్నాడు. వేయిపడగలు నవలను మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు "సహస్రఫణ్" పేరుతో హిందీ లోకి అనువదించాడు. భారతీయ సంస్కృతి, ఆచారం, విశేషాలు, మధ్య తరగతి జీవన విధానాలు ఈ నవలలో విశేషంగా చూప బడ్డాయి. తమిళనాడులోని మదురై ప్రాంతం నేపథ్యంలో వచ్చిన నవల "ఏకవీర"ను పుట్టపర్తి నారాయణాచార్యులు మళయాళంలోనికి, అంబటిపూటి హనుమయ్య తమిళంలోనికి అనువదించారు. ఏకవీర సినిమా కూడా వచ్చింది. ఆ సినిమాకు సి.నారాయణరెడ్డి మాటలు, పాటలు సమకూర్చాడు. విశ్వనాథ వ్యక్తిత్వం ప్రాచీన విధానాలకు, ఆచారాలకు కట్టుబడ్డది. భారతీయత మీద, తెలుగుదనం మీద అభిమానం కలిగింది. తన అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను నిక్కచ్చిగా తెలిపేవాడు. ఈ కారణంగా విశ్వనాథను వ్యతిరేకించిన వారు చాలామంది ఉన్నారు. ఛాందసుడు అనీ, "గతకాలమె మేలు వచ్చుకాలము కంటెన్" అనేవాడు అనీ (శ్రీశ్రీ విమర్శ) విమర్శించాడు. విశ్వనాథకు పాశ్చాత్య సాహిత్యం అంటే పడదని అనుకొంటారు. కాని ఆయన పాశ్చాత్య సాహిత్యం పట్ల గౌరవం కలిగి ఉండేవాడు. షేక్స్‌పియర్, మిల్టన్, షెల్లీ వంటి కవుల రచనలను ఆసాంతం పరిశీలించాడు. 1964లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ "కళాప్రపూర్ణ" తో సన్మానించింది. 1942లో గుడివాడ లో "గజారోహణం" సన్మానం జరిగింది. 1956 లో షష్టి పూర్తి వేడుకలు కూడా గుడివాడలో ఘనంగా జరిగాయి. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం డి.లిట్ పట్టాతో సన్మానించింది. 1962 లో "విశ్వనాథ మధ్యాక్కఱలు" రచనకు కేంద్రసాహిత్య అకాడెమీ వారి బహుమతి లభించింది. 1970 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "ఆస్థాన కవి"గా గౌరవించింది. 1970 లో భారత ప్రభుత్వము "పద్మభూషణ పురస్కారం"తో గౌరవించింది. జ్ఞానపీఠ అవార్డు పొందిన తొలి రచయిత. కొన్ని రచనలను రేడియో నాటికలుగా మలిచారు. ఆయన రచనలను ఇతర భాషల్లో కూడా అనువదించారు. విశ్వనాథ చేపట్టని ప్రక్రియ కాని, ప్రయోగం కానీ లేదు. నవల, కథ , నాటిక, పాట, ఏదైనా తగిన పరిష్కారాన్ని అందించే విధంగా ఉండటం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పద్య రచన అపూర్వం. సంస్కృత నాటకాల్లో గుప్త పాశుపతం, అమృత శర్మిష్ఠ తెలుగు నాటకాల్లో కనకరాజు, అనార్కలి ప్రసిద్ధమైనవి. ఆయన కొన్ని పత్రికలకు సంపాదకులుగా కూడా పని చేశాడు. కొంతకాలం ఆయన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమికి ఉపాధ్యక్షుడుగా ఉన్నాడు. విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా ఆంధ్రపౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఱలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనల లోనివి. విశ్వనాథ రచనలలో అతని పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి. ఆయన చేసిన "రామాయణ కల్పవృక్షము" అనే పుస్తక రచనకు గాను జ్ఞాన పీఠ అవార్డు అందు కున్నారు. కోల్‌కతా, ముంబయి ఢిల్లీ, మద్రాసు, బెంగుళూరు వంటి పట్టణాల్లో ఆయన పొందిన సత్కారాలు అపూర్వమైనవి. 1964లోఆంధ్ర విశ్వ కలా పరిషత్ విశ్వనాథను "కళా ప్రపూర్ణ" బిరుదుతో సత్కరించారు. భారత ప్రభుత్వం "పద్మభూషణ్" బిరుదుతో గౌరవించింది. ఇతర ప్రభావాలు, ప్రలోభాలు లేని విశ్వనాథ స్వాతంత్ర్య రచనా శైలిని స్పృశిస్తూ గురువు చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి తన శిష్యుని గురించి ఇలా అన్నాడు..."నా మార్గమ్మును కాదు, వీని దరయన్ నా తాత ముత్తాతలందే మార్గమ్మును కాదుబీ మార్గమది యింకేదో యనంగా వలెన్ సామాన్యుండన రాదు వీని కవితా సమ్రాట్ వవుత మా హేతువై,యీ మచ్ఛిష్యుని దా వరించినది, నేనెంతే ముదంబందెదన్". కవిగా పండితునిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, విమర్శకుడుగా, గాయకుడిగా రాణించిన విశ్వనాథ 1976 అక్టోబరు 18న తనువు చాలించారు. ఆ అద్భుత ప్రతిభాశాలి నడిచిన సాహితీసేవా మార్గంలో నేటి యువత చిత్తశుద్ధితో అడుగులు వేయాలని ఆశిద్దాం. సూర్యుని కాంతి, చంద్రుని వెన్నెల, కృష్ణమ్మ పరవళ్ళు, గోదారి చల్లదనం ఉన్నంతవరకు తెలుగు సాహిత్య అభిమానుల గుండెల్లో విశ్వనాథ మరియు ఆయన రచనలు చిరస్మరణీయం.

# వడ్డాది పాపయ్యకుంచెలో విరిసిన తెలుగుదనం



వడ్డాది పాపయ్య (సెప్టెంబరు 10, 1921 –డిసెంబర్ 30, 1992) తెలుగు చిత్రకళా ప్రపంచంలో ఒక అపూర్వ చిత్ర కారుడు. "వ.పా." అనే పొడి అక్షరాల సంతకం చూసిన వెంటనే ఆ బొమ్మ ఎవరిదో చెప్పకుండానే అర్థమయ్యేది. తెలుగు పత్రికలు, పుస్తకాలు, బాలల కథలు, పురాణ చిత్రాలు, పల్లె దృశ్యాలు ఆయన కుంచె తాకిడితో జీవం పోసు కున్నాయి. కేవలం ఒక చిత్రకారుడిగా కాకుండా రచయితగా, దృశ్య కవిగా, సృజనాత్మక తపస్విగా ఆయన నిలిచారు. శ్రీకాకుళం పట్టణంలో రామమూర్తి, మహాలక్ష్మి దంపతులకు జన్మించిన పాపయ్య తండ్రి చిత్రకళా ఉపాధ్యాయుడు కావడం వలన చిన్ననాటి నుంచే రంగుల లోకంలో మునిగి పోయాడు. ఐదేళ్ల వయసులోనే హనుమంతుని చిత్రాన్ని గీసి తన ప్రతిభను చాటుకున్నాడు. రాజా రవివర్మ, దామెర్ల రామారావు వంటి దిగ్గజాల ప్రభావం ఆయనపై బలంగా పడింది. కానీ ఆయన వారిని అనుకరించకుండా తనకంటూ ఒక ప్రత్యేక శైలిని రూపు దిద్దుకున్నారు. బొమ్మలపై మక్కువ వయసు పెరిగేకొద్దీ సాధనగా మారి, సాధన తపస్సుగా పరిణమించి, ఆ తపస్సే ఆయన చిత్ర జీవితమైంది. ఆయన శైలిలో సంప్రదాయం, ఆధునికత, జానపదం, పల్లెపాటల సౌందర్యం అంతర్లీనంగా కలిసి పోయేవి. మహిళా రూప చిత్రణలో ఆయనకున్న ప్రతిభ అసామాన్యం. స్త్రీ రూపం ఆయన చిత్రాల్లో దివ్యమైన సౌందర్యానికి ప్రతీకగా నిలిచింది. "వడ్డాది బ్యూటీ" అన్న పదం తెలుగు పాఠక లోకంలో ఒక ప్రత్యేక ముద్ర వేసింది. ఆయన గీసిన సీతారాములు, రాధాకృష్ణులు, శివపార్వతులు లాంటి దైవ రూపాలు పుస్తకాల్లో చూడగానే ఆ పాత్రలపై మరింత భక్తి, మమకారం కలుగుతాయి. అదే విధంగా ఆయన సృష్టించిన పల్లె ఆడపిల్లల రూపాలు, మత్స్యగంధి, ఊర్మిళ నిద్ర వంటి చిత్రాలు పల్లెటూరి అందాలను సజీవం చేస్తాయి. వడ్డాది పాపయ్య చిత్రాలు తెలుగు పత్రికా ప్రపంచంలో ఒక విప్లవం. "చందమామ" పత్రికలో మూడు దశాబ్దాలకు పైగా ఆయన చిత్రాలు వెలువడ్డాయి. కథ చదివే ముందే పాఠకుని మనసును గెలుచు కునేది ఆయన వేసిన బొమ్మే. "భారతి", "చంద్రిక", "ఆంధ్రప త్రిక", "ఆంధ్రజ్యోతి", "స్వాతి", "అభిసారిక", "యువ" వంటి పత్రికల్లో ఆయన బొమ్మలు ప్రత్యేక ఆకర్షణ. ఆయన చిత్రాలు కోసం పత్రికలు అమ్ముడయ్యేవి అనడం అతిశయోక్తి కాదు. గుడిపాటి వెంకట చలం, మల్లాది వెంకట కృష్ణమూర్తి, యద్దనపూడి సులోచనా రాణి నవలలకు ఆయన వేసిన కవర్ ఆర్ట్ ఆ పుస్తకాల ప్రాచుర్యాన్ని రెట్టింపు చేసింది. ఒక చిన్న చిత్రం కూడా సాహిత్యానికి ఎంత జీవం పోసుకోగలదో ఆయన చూపించారు. ఆయన చిత్రాల్లో రంగుల వినియోగం అపూర్వం. నీలి రంగుపై ఆయనకున్న మక్కువ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తైల వర్ణాల కంటే నీటి రంగుల్లోనే తాను కోరుకున్న సున్నితత్వం సాధ్యమవుతుందని భావించేవారు. నలుపు–తెలుపు చిత్రాల్లోనూ ఆయన ప్రతిభ తక్కువేమీ కాదు. వెలుగు–నీడల సమన్వయం ఆయన చిత్రాలకు అద్భుతమైన ఆహ్లాదాన్ని, కవితాత్మకతను తెచ్చింది. జీవంతో కూడిన రేఖలు, మృదువైన స్పర్శ, అలంకరణలోని నైపుణ్యం ఆయన చిత్రాలకు ప్రత్యేకతను ఇచ్చాయి. చిత్రకళ మాత్రమే కాకుండా రచనలోనూ ఆయన ప్రతిభను ప్రదర్శిం చారు. "చందమామ"లో కొడవటిగంటి కుటుంబ రావు మొదలు పెట్టిన "దేవీ భాగవతం" కథలను పూర్తి చేయడంతో పాటు "విష్ణుకథ" అనే పౌరాణిక సీరియల్‌ను రచించారు. చిన్నపిల్లల ఊహా ప్రపంచాన్ని విస్తరించేలా ఆయన చిత్రాలు, రచనలు ఒకేసారి ఆకర్షించేవి. పంచతంత్రం కథల్లోని జంతు పాత్రలకు ఆయన గీసిన చిత్రాలు ఇప్పటికీ పాఠకుల మదిలో నిలిచిపోయాయి. పాపయ్య నిరాడంబర జీవనశైలిని అవలం బించారు. ఇంటర్వ్యూలు, ప్రదర్శనలు, వ్యక్తిగత ప్రాచుర్యం ఆయనకు ఇష్టం ఉండేది కాదు. కళను గౌరవించాలి, కళాకారుని కాదు అని ఆయన నమ్మకం. ప్రయోగాత్మకంగా జేగురు మట్టి, సున్నం, బొగ్గు వంటి సామాన్య పదార్థాలతో కూడా అద్భుతమైన చిత్రాలు సృష్టించారు. తన జీవితాన్ని కళకే అంకితం చేసి, వేలాది చిత్రాలను సృష్టించి, తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచి పోయారు. 1992 డిసెంబర్ 30న ఆయన మరణం సంభవించినా ఆయన కుంచె సృష్టించిన రూపాలు, ఆయన వేసిన పుస్తక కవర్‌లు, ఆయన అలంకరించిన పత్రికా పుటలు నేటికీ జీవంగా ఉంటూ తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి. వడ్డాది పాపయ్య తెలుగు చిత్రకళకు కేవలం ఒక పేరు కాదు, ఒక యుగం. ఆయన కుంచెలో సౌందర్యం విరిసింది, ఆయన బొమ్మల్లో తెలుగుదనం మిగిలింది, ఆయన కృషిలో ఒక సంస్కృతికి చిరస్మృతి సొంతమైంది. తెలుగు చిత్రకళకు వడ్డాది పాపయ్య ఒక దీపస్తంభం. ఆయన కళలో శిల్ప సౌందర్యం, సాహిత్యానికి జీవం, పాఠకుల హృదయాల్లో అజరామరమైన స్థానం ఉన్నాయి.

## టి ఇఇ 1104 యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక



నల్గొండ సెప్టెంబర్ 9 ప్రభాత సూర్య తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్, నల్లగొండ డివిజన్ సర్వసభ్య సమావేశం స్థానిక రత్న ఫంక్షన్ హాల్ నందు జరిగినది తదానంతరం నల్గొండ డివిజన్ నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగినది. డివిజన్ అధ్యక్షులుగా: పురం రాంబాబు డివిజన్ కార్య నిర్వాహ అధ్యక్షులుగా : డెంకల సత్యనారాయణ డివిజన్ కార్యదర్శిగా : తిరుగుడు శ్రీనివాస్ గారు డివిజన్ అదనపు కార్యదర్శిగా : రామావత్ బాలు గారు డివిజన్ సంయుక్త కార్యదర్శిగా : ఎస్ లింగస్వామి ఎన్నికైనారు ఈ ఎన్నిక నల్లగొండ జిల్లా కార్యదర్శి మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ చెట్ల వెంకటయ్య, అధ్యక్షులు టి జైపాల్ రెడ్డి, కంపెనీ కార్య నిర్వాహ అధ్యక్షులు నేతకాని వెంకన్న, మేరెడ్డి రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగినది

## ప్రొటీఫైడ్ బియ్యం ఆరోగ్యానికి మంచిది



మర్రిగూడ సెప్టెంబర్ 9 ప్రభాత సూర్య మర్రిగూడ మండలంలోని ఎర్రగండ్లపల్లి లో చౌక ధరల దుకాణాన్ని ఎన్ ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్ మాచర రఘునందన్ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు రేషన్ బియ్యం లో తెల్లగా ఉండే బియ్యం ప్రొటీఫైడ్, బియ్యం అని అవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయని వాటిలో విటమిన్స్ మినరల్స్ అధిక శాతం ఉంటాయని తెలిపారు వాటిని నీటిలో కడిగేటప్పుడు వాటిని తీసివేయకుండా వాడుకోవాలని రేషన్ దుకాణదారులు ప్రజలకు అవగాహన కల్పించి వాడుకునే పద్ధతి తెలియాలని సూచించారు

# మానసిక రుగ్మతలతోనే ఆత్మహత్యలు పెరుగుతున్నాయా !

ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కన్న ఎక్కువగా, అనగా దాదాపు 12 శాతం ప్రజలు మానసిక ఆరోగ్య (మెంటల్ హెల్త్ డిసార్డర్స్) రుగ్మతలతో సతమతం అవుతున్నారని , దీని వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతూ, పేదరికం పెరుగుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ, డబ్ల్యూహెచ్ఓ తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. "ప్రపంచ ప్రస్తుత మానసిక ఆరోగ్యం (వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే)" అనే నివేదికతో పాటు "మానసిక ఆరోగ్య అట్లాస్ 2024(మెంటల్ హెల్త్ అట్లాస్ 2024)" అనే పేరుతో తాజాగా విడుదలైన నివేదికల రూపంలో పలు గంభీరమైన మానసిక ప్రజారోగ్య అంశాలు బయట పడ్డాయి. మానసిక అనారోగ్యాలకు ప్రధాన కారణాలుగా ఆందోళన (ఆంగ్జైటీ), నిరాశ (డిప్రెషన్) విష వలయంలో చిక్కిన అభాగ్యులు, ముఖ్యంగా యువత, మానసిక రుగ్మతలకు లోనవుతున్నారని నివేదిక బహిర్గతం చేయడం కొంత కలవరానికి కారణం అవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలు పెరుగుతున్నాయనే ఆందోళనల నడుమ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడాని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఏట 10 సెప్టెంబర్ రోజున "ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. నేడు అనేక ప్రపంచ దేశాలు మానసిక అనారోగ్యాలకు సరైన సమాధానంగా పలు పథకాలు, పాలసీలు, నిధుల కేటాయింపు చేయడం కొనసాగుతున్నాయి. అన్ని వయస్సుల ప్రజలు, ఆదాయ వర్గాలు, అన్ని దేశాలు, స్త్రీ పురుషులు కూడా మానసిక ఆరోగ్య రుగ్మతల వలలో చిక్కడం గమనించారు. రెండవ అతి పెద్ద దీర్ఘకాలిక ప్రజారోగ్య సమస్యగా మానసిక అనారోగ్య రుగ్మతలు అవతరించడం వల్ల మానవాళి శ్రేయస్సుకు భంగం కలగడం గమనించారు. నేటి డిజిటల్ యుగపు జనాభాకు మానసిక ఆరోగ్య సవాళ్లు రోజు రోజుకు పెరగడంతో సత్వరమే ప్రజారోగ్య పరిరక్షణకు పెట్టుబడులు పెంచడం వల్ల కుటుంబ పౌర సమాజ ఆరోగ్యం కుదుట పడుతుందని నివేదిక అంచనా వేస్తున్నది. మానసిక ఆరోగ్యంపై పెట్టుబడి అంటే ప్రజారోగ్యంపై పెట్టుబడి అని భావించాలని ఐరాస నివేదిక సారాంశంగా తెలుపుతున్నది. మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరి కనీస మౌళిక హక్కు అని తెలుసుకోవాలి. మానసిక రుగ్మతలకు చికిత్స అందించని యెడల అవి ముదిరిపోయి చివరకు ఆత్మహత్యలు కూడా పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో 7.27 లక్షలు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఈ సమస్య యువతలో మరింత అధికంగా ఉన్నట్లు గమనించారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–2030 అంచనాల ప్రకారం 2030 నాటికి కనీసం 33 శాతం వరకు ఆత్మహత్యలు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ప్రస్తుతం పరిణామాల అధ్యయనం ప్రకారం 12 శాతం వరకు మాత్రమే కట్టడి చేయగలిగే స్థాయికి చేరవచ్చని నివేదిక పేర్కొనడం అన్ని దేశాలకు ఒక తీవ్రమైన హెచ్చరికను చేసినట్లు అవుతున్నది. మానసిక రుగ్మతల్లో ఆందోళన, నిరాశ లాంటివని ప్రధానంగా మానవాళినా పట్టి పీడిస్తున్నాయని గమనించారు. మానసిక అనారోగ్యాల వల్ల పరోక్షంగా కుటుంబాలపై ఆర్థిక భారం పడడం, ఆ వ్యక్తులు తమ వృత్తిపరమైన పనులను చేసుకోకపోవడంతో ఆయా కుటుంబాల్లో పేదరికం పెరగడం జరుగుతోంది. మానసిక రుగ్మతల చికిత్స, నివారణలకు సత్వరమే సుస్థిర పెట్టుబడులు పెట్టడం, అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం, అనేక సంస్థలు కలిసి సమన్వయంతో పని చేయడం, మానసిక రుగ్మతల పట్ల అపోహలు

# గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ స్వర్ణోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరణ

**చౌటుప్పల్.సెప్టెంబర్ 09. ప్రభాత సూర్య :**గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ స్వర్ణోత్సవాల సందర్భంగా మంగళవారం ట్రినిటీ హై స్కూల్ లో చౌటుప్పల్ మండల శాఖ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవాల గోడ పత్రికను సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి ,తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు తో కలిసి ఆవిష్కరించారు. అక్టోబర్ 10 నుంచి 13 వరకు ఎల్బీ స్టేడియంలో బాపు బాట, గాంధీజీ లక్ష విగ్రహాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి వెల్లడించారు. మహాత్మా గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సు.. స్వదేశీ మేళా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటి స్వదేశీ మొక్కల పెంపకం, ఖాదీ ,చేనేత వస్త్ర ప్రదర్శన, గాంధీజీ ఆచార్య వినోబాభావే సాహిత్యం పుస్తక ,చిత్రాల ప్రదర్శన , ఎద్దు గానుగ ప్రదర్శన యోగా ,మల్కంబ్ ఆటలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ రేవంత్ రెడ్డిని, కేంద్ర రాష్ట్ర మంత్రులను, గాందేవాదులను, పర్యావరణవేత్తలను ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు .మండల అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్య రాజు సభా అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పలు అంశాలు చర్చించి అక్టోబర్లో,ఎల్బీ స్టేడియం నందు జరిగే స్వర్ణోత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించి , ప్రజలంతా ఈ మహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ,గాంధీ తత్వాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి నిర్వహించే కార్యక్రమానికి దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే వి బి కృష్ణారావు,ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి,మండల



ప్రధాన కార్యదర్శి, కోశాధికారి డాక్టర్ ఉజ్జిని మంజుల,పోలోజు శ్రీలత ,ఉపాధ్యక్షురాలు బొబ్బిలి సంధ్య , వనం మమత,ఎం నీరజ ,ఝాన్సీ రాణి ,పోలోజు జయశ్రీ, సువర్ణ లక్ష్మి, రమ ,అనుష ,రాధిక తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధగా వెలిగిన ధైర్య నక్షత్రం చాకలి ఐలమ్మ







స్వాతంత్ర్య ఉద్యమంలో ఐలమ్మ ప్రవేశం
చాకలి ఐలమ్మ జైలు జీవితం మరియు ఆమె త్యాగం
చాకలి ఐలమ్మ పుట్టిన ఊరు ఐలమ్మ కుటుంబం
వీరనారి చాకలి ఐలమ్మకు ఇవే మా జోహార్లు

**గట్టుప్పల్ ప్రభాతసూర్య 09** పూర్వ కాలంలో, మన దేశం మన మనిషికి స్వేచ్ఛ లేదు. బ్రిటిష్ పాలన క్రూరత్వంతో ప్రజల జీవితాలను అలమటతో నింపిన కాలం అది. ఆకాలంలో దేశ సేవకు త్యాగం చేసిన మహిళల కథలు ఎంతో అరుదుగా మన ముందుకు వస్తాయి. అలాంటి ఒక నిస్వార్థ మహిళ చాకలి ఐలమ్మ పుట్టిన ఊరు మరియు ఐలమ్మ కుటుంబం చాకలి ఐలమ్మ 1905 లో తెలంగాణలో ఒక చిన్న గ్రామంలో జన్మించారు. ఆమె కుటుంబం వ్యవసాయపనులు చేసి స్వల్పమైన జీవనాధారాన్ని నిర్మించుకుని ఉండేది. చిన్నప్పటి నుంచి చాకలి ఐలమ్మలో అసాధారణ ధైర్యం, ఉత్సాహం కలిగిన బాలికగా ప్రసిద్ధి చెందారు. ఆమె తల్లిదండ్రులు కష్టపడి ఉండగా కూడా, విద్యాభ్యాసానికి, సమాజ సేవకు గల ఆసక్తిని పూర్వదశలోనే ప్రదర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఐలమ్మ ప్రవేశం చాకలి ఐలమ్మ యవ్వనంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడం మొదలుపెట్టారు. ఆ సమయం బహుళంగా విప్లవాలు, నిరసనలు, అరాచకాలు చోటుచేసుకున్నప్పుడు, ఐలమ్మ గ్రామీణ ప్రజలకు పసిడి వచనంగా మారారు. బ్రిటిష్ సైనికుల గౌరవ నిషేధాలు, ప్రజలపై అసహ్యమైన దాడులు, పన్నులు విధించడం వంటి అన్యాయాలకు తిట్లు పలికే ధైర్యాన్ని ఆమె ప్రదర్శించారు. ఐలమ్మ ప్రత్యేకంగా గ్రామస్థ మహిళలను కలిపి స్వాతంత్ర్య ఉద్యమ చర్యలకు ప్రేరణనిచ్చారు. ఆమె వారిని సంఘటితంగా, సమన్వయంగా పని చేయించడం ప్రారంభించారు. పత్రికలు, సమావేశాలు, నిరసనలు, దళితుల హక్కుల కోసం పోరాటాలు ఇవన్నీ ఆమె నాయకత్వంలో సాగాయి. ఐలమ్మ పాల్గొన్న ముఖ్య సంఘటనలలో ఓటి 'ఖిలాఫత్ ఉద్యమం' మరియు 'జలియన్వాలా బాగ్ హత్యకాండం' తరువాత వచ్చిన జన విప్లవ తరంగంలో ఆమె పాత్ర గుర్తించదగినది. 1930 లో మహాత్మా గాంధీజీ నాయకత్వంలో జరిగిన సత్యాగ్రహ ఉద్యమంలో ఐలమ్మ తాము నిర్వహించిన గ్రామ సత్యాగ్రహాలు ద్వారా బ్రిటీష్ అధికారులకు చెమటలు పెట్టారు. ఐలమ్మ ఉగ్ర బ్రిటిష్ రిప్రెషన్ ను ఎదుర్కొని, అరెస్టులు, జైలు శిక్షలను మించిన ధైర్యంతో ఎదుర్కొన్న ఒక స్ఫూర్తిదాయక మహిళ. ఆమె ప్రజల కోసం చేసిన కార్యకలాపాలు బ్రిటిష్ పాలకులకు పెద్ద తలనొప్పిగా మారాయి. ఐలమ్మ జైలు జీవితం ఆమె త్యాగం ఐలమ్మ అనేకసార్లు బ్రిటిష్ పాలకుల చేత అరెస్టవ్వడం జరిగింది. జైలులో ఉన్నప్పుడు కూడా, ఆమె నిరాహార దీక్షలు చేపట్టి, స్వాతంత్ర్య పోరాటాన్ని మరింత ఉక్కిరిబిక్కిరి చేయడం ద్వారా ప్రజల హృదయాల్లో చోటు చేసుకున్నారు. జైలు జీవితం ఆమెకు మృత్యువు కాదు, ఒక పోరాట సమరం. అక్కడే ఆమె మరింత జ్ఞానం, వ్యక్తిత్వాన్ని సంపాదించి స్వతంత్ర భారతదేశం కోసం స్ఫూర్తిగా నిలిచారు. స్వాతంత్ర్యం తర్వాత చాకలి ఐలమ్మ జీవితం 1947 లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, చాకలి ఐలమ్మ తన లక్ష్యాలను గ్రామస్థ ప్రజల అభివృద్ధికి కేటాయించారు. మహిళలకు విద్యాపై అవగాహన, గ్రామ సత్ప్రవృత్తుల ప్రోత్సాహం, సామాజిక న్యాయాలు సాధించడానికి ఐలమ్మ జీవితాంతం కృషి చేశారు. ఆమె సమాజంలోని మహిళల హక్కుల పరిరక్షణలో ఒక నిలువెత్తిన నాయకురాలు. పేదవారికి ఆర్థిక సహాయం, అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను ఆమె నడిపించారు. చాకలి ఐలమ్మ జీవితం, ధైర్యం, నిస్వార్థ త్యాగం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి, ప్రత్యేకంగా తెలంగాణ ఉద్యమానికి అమూల్యమైన ఘనత ఇచ్చింది. ఆమె పేరు శతాబ్దాల తరబేధంలో స్ఫూర్తిగా నిలుస్తుంది. 1970లలో ఐలమ్మ సన్మానంతో కూడిన శాంతిమయమైన జీవితాన్ని గడిపారు. చివరకు 1978లో ఆమె స్వర్గస్థానికి చేరారు. గ్రామస్థులు, విద్యార్థులు, స్వాతంత్ర్య పోరాటయోధులు ఆమె సేవను ఎన్నడూ మర్చిపోలేరు. చాకలి ఐలమ్మ భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక అజేయ గాథ. తన జీవితం పోరాటం, త్యాగం, సమాజ సేవకు అంకితం అయింది. నిర్దయ బ్రిటిష్ పాలనను ఎదిరించి, స్వాతంత్ర్యం తరువాత కూడా సామాజిక సేవా రంగంలో నడిపించిన ఆమె కృషి, ఆశయం ఎల్లకాలం ఆదర్శంగా నిలుస్తాయి. కాబట్టి వీరనారి చాకలి ఐలమ్మకు ఇవే మా జోహార్లు

# విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

-ప్రిన్సిపల్ కె.వెంకటరావు

**చౌటుప్పల్. సెప్టెంబర్ 09. ప్రభాత సూర్య :** హైదరాబాద్ గోల్కొండ జోన్లో ఈనెల 2 నుంచి 5 వరకు జరిగిన ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీల్లో ఎంజేపీటీ బీసీ డబ్ల్యు. ఆర్.ఐ.ఈ.ఎస్ స్కూల్స్ కార్వాన్, మలక్పేట విద్యార్థులు ఖో ఖో అండర్- 14 ప్రథమ బహుమతి,కబడ్డీ అండర్- 14 ద్వితీయ బహుమతి, కబడ్డీ అండర్-17 ప్రథమ బహుమతి, ఖో ఖో అండర్-17 ప్రథమ బహుమతి పొందారని ప్రిన్సిపాల్ కే వెంకట్రావు తెలిపారు.ఈ ఎస్ జి ఎఫ్ జోనల్ లెవెల్ నుండి తమ పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె వెంకటరావు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు క్రీడలో రాణించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యత సంపాదించాలని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వలన విద్యార్థులకు మానసిక వికాసం సిద్ధిస్తుందన్నారు. కృషి పట్టుదల ఉంటే సాధించలేనిదంటూ ఏమీ లేదన్నారు. తర్వాత జరగబోయే జిల్లా క్రీడలో విద్యార్థులు విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఎస్జీఎఫ్ క్రీడల్లో విద్యార్థులను విజేతలుగా తయారుచేసిన ఫిజికల్ డైరెక్టర్ పి హేమంత్ కుమార్, ఎం సతీష్ లను




ప్రిన్సిపల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ వి.హరికుమార్ బి డబ్ల్యు అజార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్న డి.సి.ఓ కే వెంకటరావు

**చౌటుప్పల్. సెప్టెంబర్ 09. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా, దేశ్ముఖి పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల మలక్పేట్, కార్వాన్ బాయ్స్ పాఠశాల ప్రిన్సిపాల్, డిసిఓ కే వెంకట్రావు 2025 సెప్టెంబర్ 5 న గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గోన్న కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే. వెంకట్ రావు హైదరాబాద్ డీసీఓ గ్రేడ్ 1 మలక్పేట్, కార్వాన్ ప్రిన్సిపాల్ గా వారు గురుకులాల్లో అందించిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా - రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డ్ తీసుకున్న కే. వెంకట్రావుని హైద్రాబాద్ కలెక్టర్ అభినందించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కే. వెంకట్ రావ్ మాట్లాడుతూ....ఈ అవార్డు తనకు రావడం చాలా సంతోషంగా ఉందని, బీసీ గురుకులాల అభ్యున్నతికి సహరించిన గురుకులాల సెక్రటరీ బడుగు సైదులు కు మరియు జాయింట్ సెక్రటరీ తిరుపతి కి ప్రిన్సిపల్ కే వెంకట్రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మలక్పేట్ కార్వాన్ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.




## పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయం...!

-వందరోజుల కార్యాచరణ ప్రణాళిక విజయోత్సవాలు
-ఉత్తమ పారిశుద్ధ్య కార్మికులకు అవార్డు, సన్మాన పత్రాలు అందజేత..
-పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయం...
-చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి




**చౌటుప్పల్.సెప్టెంబర్ 09. ప్రభాత సూర్య:** పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డి అన్నారు. చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా చివరి రోజైన మంగళవారం విజయోత్సవ సమావేశంను మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశంలో బెస్ట్ వర్కర్ అవార్డు ను గుడ్డేటి పారిజాత, దుబ్బాక అంజయ్య, ఉబ్బు నరసింహ, ఎర్ర యాదయ్య లను ఉత్తమ పారిశుధ్య కార్మికులుగా సన్మాన పత్రాన్ని,అవార్డును అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గౌరవ కమిషనర్ మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికులుగా మీరు చేస్తున్న సేవలు చౌటుప్పల్ పట్టణానికి వెల కట్టలేనివన్నారు. ఇదేవిధంగా కష్టపడి పని చేస్తూ స్వచ్ఛ సర్వేక్షన్ 2026 అవార్డును చౌటుప్పల్ కు తీసుకురావాలని కోరారు. వందరోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్క పారిశుధ్య కార్మికుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కార్మికులతో వందరోజుల విజయోత్సవ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, ఏవో రవీందర్, ఆర్ ఐ దీప, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, వార్డు అధికారులు, టీఎంసీ కవిత, మెప్మా బృందం, బిల్ కలెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

-ఎస్ జి ఎఫ్ మండల స్థాయి అండర్ 14 -17 బాల బాలికల ఎంపిక...
-చౌటుప్పల్ మండల విద్యాధికారి ఈ గురువారావు



విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాధికారి గురువారావు అన్నారు. మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చౌటుప్పల్ మండల స్థాయి అండర్ 14-17 బాల బాలికలకు క్రీడా ఎంపిక పోటీలను తంగడపల్లి గ్రామంలోని ముస్కు మధుసూదన్ రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఎస్జిఎఫ్ మండల క్రీడల కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ ఏ లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాల నుండి సుమారు 600 మంది క్రీడా విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అండర్ 14 -17 బాల బాలికల కబడ్డీ జట్టు, అండర్ 14 -17 వాలీబాల్ జట్లు, అండర్ 14 -17 ఖో ఖో జట్లను ఎంపిక చేసినట్లు మండల విద్యాధికారి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెలలో జరిగే జిల్లా స్థాయి టోర్నమెంట్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి గురువారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎస్జిఎఫ్ క్రీడాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపికైన విద్యార్థులు క్రీడలలో జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచి చౌటుప్పల్ మండలానికి, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పి కృష్ణమూర్తి గౌడ్, కిరణ్, లింగస్వామి, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు , క్రీడా విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు

-ప్రజల్లో చైతన్య దీప్తిని వెలిగించిన ఆశాజ్యోతి కాళోజి...
-మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రామిరెడ్డి



**చౌటుప్పల్.సెప్టెంబర్ 9. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ పురపాలక కేంద్రంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ప్రజా కవి కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాళోజి నారాయణరావు చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి, అధికారులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... కాళోజి తన కవిత్వాల ద్వారా ఎంతో మందిని మేలుకొల్పారని, తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్యపరిచిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు కాళోజి నారాయణరావు అని పేర్కొన్నారు. భావితరాల వారు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, ఏవో రవీందర్, ఆర్ ఐ దీప, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్,టీఎంసీ శ్రీమతి కవిత,ఈ ఈ రేణు కుమార్, వార్డు అధికారులు, మెప్మా బృందం, బిల్ కలెక్టర్లు, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజానాట్యమండలి రాష్ట్ర మూడో మహాసభ కొత్త లోగో ఆవిష్కరణ

ప్రజానాట్యమండలి లోగోను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్ ప్రభాతసూర్య 9** ప్రముఖ సామాజిక వేదిక ప్రజానాట్యమండలి రాష్ట్ర మూడోవ మహాసభ లోగోను రవీంద్రభారతి భవనంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రజానాట్యమండలి నూతన లోగోను అధికారికంగా ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి ద్వారా ప్రజలకు వినోదాత్మకంగా, సామాజిక, రాజకీయ విషయాలపై అవగాహన కల్పిస్తూ ప్రజాస్వామ్య బలాన్ని పెంపొందించడం లక్ష్యంగా పని జరుగుతోందని సభ్యులు ఉల్లేఖించారు. కొత్త లోగో ప్రజానాట్యమండలి యొక్క నూతన దృష్టిని ప్రతిబింబిస్తున్నట్లు, ఉత్సాహభరితంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు శ్రీ ఎండి జబ్బర్ , ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి శ్రీ కట్ట నరసింహ , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ మారన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి కళ్యాణ్ ఇతర ప్రముఖ నగర నాయకులు రఘు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత ఆశయాలతో చదువుకోవాలి

**–జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోలి ప్రభాకర్**







**చౌటుప్పల్.సెప్టెంబర్ 09. ప్రభాత సూర్య :** విద్యార్థులు ఉన్నత ఆశయాలతో గొప్ప చదువులు చదివి తల్లిదండ్రులకు, దేశానికి, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గోలి ప్రభాకర్ అన్నారు. చౌటుప్పల్ మండలం, చిన్న కొండూరు గ్రామంలోణి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన వంటి పలు పోటీ కార్యక్రమాలను నిర్వహించారు. పోటీలో గెలిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా గోలి ప్రభాకర్ మాట్లాడుతూ.. జై భారత్ చారిటబుల్ ట్రస్ట్ ఎల్లవేళలా పేద విద్యార్థినీ విద్యార్థులకు చదువుకోవడానికి సహాయపడుతుందని చెప్పారు. మంచి పరిజ్ఞానం, మంచి ప్రతిభ కలిగిన విద్యార్థులను గుర్తించి సహాయం చేస్తామని అన్నారు .ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొల్లి రవికుమార్, క్రాంతికుమార్, స్వప్న, గౌసియా, మమత, స్వరూప, లింగస్వామి, లలిత, శైలజ, రజిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాము, ఉపాధ్యాయినీ

# ప్రధానమంత్రి మోడీకి పాలాభిషేకం చేసిన కంచి మహేందర్

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**




**బాలానగర్, 09 సెప్టెంబర్ (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు కంచి మహేందర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోడీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం దేశ ప్రజలందరికీ ఎంతో మేలు చేస్తుంది అని సాధారణ కుటుంబాల జీవన వ్యయాన్ని తగ్గించడమే కాకుండా వ్యాపారులకు, రైతులకు కూడ ఊరటనిస్తుంది అని తెలియజేశారు. ప్రజల హితాన్ని కోరే ప్రధానమంత్రి మోడీ సేవలు ఎల్లప్పుడూ పేదలకు అనుకూలంగా ఉంటుందని తెలియజేసారు. దేశంలో పేదలు అనుభవిస్తున్న ఆర్థిక బాధలను చూసి కేంద్రం భారీ స్థాయిలో జిఎస్టి తగ్గుదల చేయడం తో సామాన్యులకు భారీ స్థాయిలో మేలు జరగడంతో ఫతేనగర్ డివిజన్ బిజెపి శ్రేణులు భారీ సంఖ్యలో చేరుకొని మోడీకి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి, కూకట్ పల్లి రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ జిఎస్టి 28%, 12 స్లాబులతో ఉండడంతో ముఖ్యంగా పేద ప్రజలుపై పడుతున్న అర్థిక భారం పడుతున్న విషయాన్ని గ్రహించి 5% చేయడంతో పేద ప్రజలపై భారీగా భారం తగినట్లు అయింది. దీనితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కంచి మహేందర్ పిలుపుమేరకు భారీ స్థాయిలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఫతేనగర్ బిజెపి నాయకులు రఘు యాదవ్, సతీష్ గౌడ్, బానిష్, రఘు, శివ, ఉషారాణి, మహాలక్ష్మి, అశోక్, వినీత్ యాదవ్, బత్తి రమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం**

**చండూరు సెప్టెంబర్ 09 ప్రభాత సూర్య :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. మంగళవారం చండూరు మండల పరిధిలోని నేర్మట గ్రామంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ సమావేశం ఈరటి వెంకటయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేర్మట గ్రామంలో మౌలిక సదుపాయాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే మహిళలకు రూ.2500 రూపాయలు, వికలాంగులకురూ. 6000రూపాయలు, కూలీలకు 12 వేల రూపాయలు, కళ్యాణ లక్ష్మికి అదనంగా తులం బంగారం ఇస్తానని ఇంతవరకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఆయన అన్నారు. చుట్టుపక్కల గ్రామాలకు లింకు రోడ్ల సౌకర్యం కల్పించి, రవాణా సౌకర్యం కల్పించాలని ఆయన అన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, నిరుపేదలకే ఇల్లు కేటాయించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ గ్రామంలో మురికి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం యూరియా పంపిణీలో వివక్షత చూపిస్తుందని, ఇప్పటివరకు రావలసిన యూరియా 50 మాత్రమే పంపిణీ జరిగిందని ఆయన అన్నారు. యుద్ధ ప్రాతిపదికన యూరియాను పంపిణీ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, సిపిఎం నాయకులు ఈరటి వెంకటయ్య, బల్లెం స్వామి, నారపాక శంకరయ్య, కలిమెర సైదులు,ఈరగట్ల నరసింహ, కొత్తపెల్లి వెంకన్న, బొమ్మరగోని యాదయ్య, నారపాక లింగయ్య, నరసింహ, లక్ష్మమ్మ, రాములు, పర్వతాలు,తదితరులు పాల్గొన్నారు.




# ఇదేం గలీజు దందా!

**వేసవిలో 'చిట్టడివి'ని సృష్టించారంట**
**బల్దియా పార్కులో అను'మతి లేని రెస్టారెంట్'**
**ప్రజల వినోదానికి ఏర్పాటు చేసిన పార్క్‌లో ఫుడ్ బిజినెస్**
**టికెట్ పెట్టి ఎంట్రీ ఫీజు రూ.50 వరకు వసూలు**
**కరీంనగర్ బల్దియా నిర్లక్ష్యం.. చెలరేగుతున్న లీజుదారులు**
**పార్కులో 5000 మొక్కలు నాటి, అడవిని సృష్టించామంటూ గొప్పలు**
**బల్దియా వీరికి పార్కు ఇచ్చిందా? స్థలమిచ్చిందా? అని వాకర్స్ ప్రశ్న**
**సాయంత్రానికి రెస్టారెంట్‌కు అనుమతి లేదన్న ఎంసీకే కమిషనర్**




**కరీంనగర్:** కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన మల్టీపర్పస్ పార్కును ఇష్టానికి వినియోగిస్తున్నారు. పార్కు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, అనుమతి లేకున్నా రెస్టారెంట్లు, దాబాలు ఏర్పాటు చేస్తూ హడావుడి చేస్తున్నారు. ఈ దందాలో మాజీ కార్పొరేటర్లు భాగస్వాములు కావడంతో బల్దియా అధికారులు అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. కమిషనర్ అసలు మల్టీపర్పస్ పార్కులో రెస్టారెంట్‌కు ఎలాంటి అనుమతి లేదని, రద్దు చేస్తామని తొలుత తెలిపారు. రాత్రి 8.30 గంటల తరువాత ఇదే విషయాన్ని అధికారికంగా మాట్లాడారు. వినోదం కోసం ఏర్పాటుచేసిన పార్కులో ప్రజల జేబులకు చిల్లుల పడేలా వ్యవహరిస్తున్న మాజీ కార్పొరేటర్లు, వారితో కుమ్మక్కయిన బల్దియా అధికారులు కలిసి ఇంతకాలం చేసిన ఈ వ్యవహారం కమిషనర్ జోక్యంతో ముగిసినట్లయింది.

**అసలేం జరిగింది?**

కరీంనగర్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో చేపట్టిన మల్టీపర్పస్ పార్కు నిర్మాణం ఆదినుంచి వివాదాల నడుమే సాగింది. నిర్మాణంలో సుదీర్ఘ జాప్యం జరిగిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఒప్పందం ప్రకారం నిర్మించిన కాంట్రాక్టరు మూడేళ్లపాటు నిర్వహణ బాధ్యతలు చూడాలి. అతన్ని కాదని మరో కాంట్రాక్టరుకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. తరువాత ఓ మాజీ కార్పొరేటర్ భాగస్వామిగా ఉన్న సంస్థకు లీజుకిచ్చారు. ఈ లీజు చెల్లదంటూ పలువురు మాజీ కార్పొరేటర్లు ఫిర్యాదులు చేసినా బల్దియా వర్గాలు పట్టించుకోలేదు. పార్కులో ప్రవేశానికి రూ.20 ఎంట్రీ ఫీజు వసూలు చేయడం ప్రారంభించారు. దీనిపై విమర్శలు వచ్చినా.. భాగస్వాముల్లో మాజీ కార్పొరేటర్ ఉండటంతో బల్దియా అధికారులు కిమ్మనలేదు. తరువాత ఈ ఫీజును వారాంతాల్లో రూ.50కి పెంచారు. ఒప్పందంలో రూ.50ఫీజుగా తాము నిర్ణయించలేదని కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ స్పష్టం చేశారు. ఈ లెక్కన వారంతాల్లో రూ.50 చొప్పున వసూలు చేసిన అధికఫీజు ఎవరి జేబులోకి వెళ్లింది అనేది ప్రశ్నార్థకంగా మారింది. అది చాలదన్నట్లుగా ఇక్కడ రెస్టారెంట్ ప్రారంభించారు. వాస్తవానికి మున్సిపల్ పార్కుల్లో చిప్స్ తదితర ప్యాక్డ్ ఫుడ్ విక్రయించాలి. అక్కడే ఆహారం వండితే పొగ, కూరగాయల వ్యర్థాలతో వాకర్స్‌కు ఇబ్బంది కలుగుతుంది. ఎలకలు పందికొక్కులు వచ్చి మొక్కలను నాశనం చేస్తాయి. నగరవాసులకు ఆహ్లాదం కోసం నిర్మించిన పార్కు లక్ష్యం కాస్తా.. పక్కదారి పడుతోంది. ప్రస్తుతం లీజుకు తీసుకున్న నిర్వాహకులు బల్దియా అధికారులతో ఉన్న పాత పరిచయంతో రెస్టారెంట్ నిర్మాణం ప్రారంభించారు. లీజుకు తీసుకున్న వారు వాకర్స్‌కు ఆహారం అందిస్తామంటూ మున్సిపల్ కమిషనర్‌కు పెట్టుకున్న దరఖాస్తు వింతగా ఉంది. వారు పార్కును ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రెండేళ్ల కాలానికి లీజుకు తీసుకుని అభివృద్ధి చేశామని, వేసవికాలంలోనూ పార్కులో 5000 మొక్కలు నాటామని, చిన్నపాటి అడవిని సృష్టించామని, ఆక్సిజన్ జోన్‌గా మార్చామని చెప్పుకున్నారు. ఇందుకోసం ఏకంగా రూ.50 లక్షలు ఖర్చు చేశారంట. అందుకే, సందర్శకుల తాకిడి పెరిగి ఆహారం అందించాలని పట్టుబడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. కాబట్టి రెస్టారెంట్‌కు అనుమతి కావాలంటూ 6వ తేదీన కమిషనర్‌కు ఒక దరఖాస్తు పెట్టుకున్నారు. తీరా 7వ తేదీన ప్రారంభోత్సం చేశారు. కేవలం 18 గంటల్లో అక్కడ రెస్టారెంట్ కొలువుదీరిన రహస్యం అటు బల్దియా, ఇటు నిర్వాహకులకు మాత్రమే తెలుసు.

తమకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని వాదనకు దిగాడు. తీరా సాయంత్రానికి కమిషనర్ అనుమతులనే రద్దు చేశామని ప్రకటించడంతో చేసేది లేక తోకముడిచాడు. ఈ విషయమై వివరణ కోరేందుకు యత్నించగా సంబంధిత ఇంజినీర్లు ఫోన్లు స్విచాఫ్ చేసుకోవడం గమనార్హం. చివరకు బల్దియా కమిషనర్ అధికారికంగా రెస్టారెంట్‌ను మూసివేస్తామని ప్రకటించడంతో బల్దియా అధికారుల ఫోన్లు స్విచ్ఆన్ అయ్యాయి. బల్దియా అధికారుల అవినీతి, వారికి మామూళ్లు ఇచ్చి అక్రమాలకు పాల్పడుతున్న మాజీ కార్పొరేటర్ల ధనదాహానికి ఈ రెస్టారెంట్ చక్కటి ఉదాహరణ అని నగరవాసులు అభివర్ణిస్తున్నారు.

## ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల బృందం సందర్శన



**చౌటుప్పల్.సెప్టెంబర్ 09. ప్రభాత సూర్య:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సర్పంచ్ల బృందం మంగళవారం చౌటుప్పల్ మండలంలోని డి.నాగారం గ్రామపంచాయతీనీ సందర్శించి పంచాయతీకి సంబంధించిన పలు అంశాలపై సమగ్ర పరిశీలన చేశారు.మాతా శిశు ఆరోగ్యం సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలపై మెడికల్ ఆఫీసర్ ఐ సి డి ఎస్, ఎంపీడీవో సందీప్ కుమార్ వారికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏపీ డి ఆర్ డి ఎస్ సురేష్, డి ఎల్ పి ఓ, ఎంపీ ఓ అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, విజయ్, జలంధర్, పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన క్రాంతికిరణ్ కు శుభాకాంక్షలు వెల్లువ

**ఎస్సి మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొంద్రు పురుషోత్తం**



**తుర్కయంజాల్,సెప్టెంబర్ 09, ప్రభాత సూర్య:** రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతికిరణ్ అన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన క్రాంతికిరణ్‌ను ఆ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొంద్రు పురుషోత్తం కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో దళితులపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని వ్యక్తం చేశారు. దళితుల సమస్యలపై పోరాడి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## ఘనంగా కాళోజీ 111వ జయంతి వేడుకలు




**తుర్కయంజాల్, సెప్టెంబర్ 09, ప్రభాత సూర్య:** ధిక్కారమే జీవితంగా గడిపిన పద్మవిభూషణ్, ప్రజాకవి కాళోజీ నారాయణరావు అందరికీ స్ఫూర్తిదాయకమని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి అన్నారు. కాళోజీ 111వ జయంతి సందర్భంగా మున్సిపల్ ఆఫీసులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణకు కాళోజీ సేవలను ఆయన స్మరించుకున్నారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్యం ఎంతో స్ఫూర్తిని నింపిందని కొనియాడారు. సమసమాజ స్థాపన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, టీపీవో దినేష్, శానిటరీ ఇన్ స్పెక్టర్ వనిత, ఆర్ఐ వినయ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లడ్డు ప్రసాదం కైవసం చేసుకున్న సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 09 (ప్రభాత సూర్య) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ 124 డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో కొలువై నవరాత్రులు పూజలందుకున్న వినాయక లడ్డు ప్రసాదాన్ని ఒకలక్ష పదకొండు వేళా రూపాయలకు (1,11,000) లకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ వినాయకుడి లడ్డు ప్రసాదం నవరాత్రులు పూజలందుకొవడంతో ఆ లడ్డును పోద్దినవారు మంచి శు భపరిణామాలు కలుగుతుందని అపారమైన నమ్మకం ఆ నమ్మకంతో ఈ రోజు లడ్డును పొందే భాగ్యం నాకు దక్కిందని అన్నారు. వినాయకుడి కృపతో అన్ని విజయాలు కలగాలని నాకు ఈ అవకాశం కల్పించిన ఎలమ్మబండ వినాయక భక్త బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేశారు.

## ఆల్విన్ కాలనీ లో అంగరంగ వైభవంగా గణేష్ నిమజ్జన వేడుకలు

**విఘ్నేశ్వరుని నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఎర్రబెల్లి సతీష్ రావు**



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 09 (ప్రభాకర్ సూర్య) :** శేరిలింగంపల్లి నియోజికవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ లోని మహాత్మాగాంధీ నగర్ లో చిన్నోల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, తులసి నగర్ లో గోపి ఆధ్వర్యంలో, ఇంద్ర హిల్స్ లో బి ఆర్ ఎస్ వి నాయకులు కళ్యాణ్ ఆధ్వర్యంలో ఇతర కాలనీల్లో ఏర్పాటు చేసిన పలు గణేష్ నిమజ్జన వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని విఘ్నేశ్వర స్వామికి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆయా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు షేక్ ఫరూక్ జన్మదిన వేడుకలు.



శేరిలింగంపల్లి ప్రభాత సూర్య : శేరిలింగంపల్లి బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఫరూక్ తన పుట్టినరోజు సందర్భంగా బీజేపీ కుటుంబ సభ్యులుతో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఏ ఏ ఎఫ్ ట్రూ హెల్పింగ్ హాండ్స్ సమస్త ద్వారా అనాథ పిల్లలకు భోజనాలు, స్వీట్స్ పంపిణీ చేయడం విశేశాం, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో చేసుకోవాలని, నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆ భగవంతున్ని కోరారు. ఫరూక్ మాట్లాడుతూ నాకు చాలా సంతోషంగా ఉంది ఇల అనాథ పిల్లలతో నా జన్మదిన వేడుకలు జరుపుకోవడం నాకు దేవుడిచ్చిన వారమని అన్నారు.నాకు వీలున్నప్పుడల్లా నాతోటి స్నేహితులతో కలిసి వీలైనంతవరకు అనాథ పిల్లలకు నాకు అయినంత సహాయం చేస్తానని చెప్పుకొచ్చారు.

## బిజినెస్

# ఆ బెనిఫిట్స్ ఏం లేవ్

## జీఎస్టీ తగ్గింపుపై బాంబు పేల్చిన ట్యాక్స్ విభాగం

వస్తు సేవల పన్ను జీఎస్టీలో మార్పులు సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. జీఎస్టీ 2.0లో కేవలం రెండు పన్ను శ్లాబులు 5, 18 శాతం ఉంటాయి. 12, 28 శ్లాబులను తొలగించారు. దీంతో చాలా రకాల వస్తువులు, సేవలపై పన్నుల భారం తగ్గి ప్రజలకు ప్రయోజనాలు అందనున్నాయి. ఈ క్రమంలోనే జీఎస్టీ కొత్త రూల్స్ గురించి చాలా రకాలుగా సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో ఓ వైరల్ పోస్టుపై కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ విభాగం క్లారిటీ ఇచ్చింది. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమలులోకి వస్తోన్న జీఎస్టీ కొత్త రూల్స్ కింద కొత్త ట్రాన్సిషన్ బెనిఫిట్స్ ఉంటాయన్న ప్రచారాన్ని ఖండించింది. అలాంటి బెనిఫిట్స్ ఏం లేవని తేల్చేసింది. ఈ మేరకు ఆ ప్రకటన జారీ చేసింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్ విభాగం (సీబీఐసీ) ఛైర్మన్ ఓ ప్రకటన చేశారంటూ సోషల్ మీడియాలో జీఎస్టీ బెనిఫిట్స్‌కి సంబంధించి ఓ పోస్ట్ సర్క్యులేట్ అవుతోంది. జీఎస్టీ మార్పుల ద్వారా చాలా రకాల బెనిఫిట్స్ ఉంటాయని, ప్రధానంగా యుటిలైజ్డ్ సెస్ క్రెడిట్, మినహాయింపు ఉన్న సరఫరాల ఐటీసీ వంటివి ఉంటాయని ఆ పోస్టులో రాసుకొచ్చినట్లు సీబీఐసీ తెలిపింది. సెప్టెంబర్ 22, 2025 నుంచి ఈ కొత్త ధరల సవరణ అమలులోకి తెస్తున్నట్లు సీబీఐసీ ఛైర్మన్ జారీ చేసినట్లు పోస్ట్ పేర్కొందని, అది తప్పుడు ప్రచారమని స్పష్టం చేసింది. అలాంటి ప్రచారాలు తప్పుడు, తప్పుదారి పట్టించేవి అని తెలిపింది. సీబీఐసీ ప్రకటన ప్రకారం.. ‘ జీఎస్టీ మార్పుల ద్వారా చాలా రకాల బెనిఫిట్స్ ఉంటాయంటూ సీబీఐసీ ఛైర్మన్ జారీ చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న ఓ పోస్టు మా దృష్టికి వచ్చింది. అన్‌యుటిలైజ్డ్ సెస్ క్రెడిట్, ఎగ్జెంప్టెడ్




సప్లాయిస్ ఐటీసీ, కొత్త ధరల సవరణ బెనిఫిట్స్ వంటివి అందులో క్లెయిమ్ చేశారు. అటువంటి వాదనలు వాస్తవంగా తప్పు, తప్పుదారి పట్టించేవని తెలియజేస్తున్నాం’ అని పేర్కొంది. దేశ ప్రజలు, ట్రేడ్ యూనియన్లు, ఇండస్ట్రీ కమ్యూనిటీల సభ్యులు, ఇతర భాగస్వామ్యులు ఇలాంటి వాటిని నమ్మవద్దని సూచించింది. ప్రభుత్వం అధికారికంగా జారీ చేసే నోటిఫికేషన్లు, సర్క్యులర్లు, ఎఫ్ఏక్యూలను మాత్రమే చూడాలని కోరింది. దాని ద్వారానే తదుపరి తరం జీఎస్టీ సంస్కరణల గురించి తెలుసుకోవాలని స్పష్టం చేసింది.

సెప్టెంబర్ 3వ తేదీన జరిగిన జీఎస్టీ 56వ కౌన్సిల్ సమావేశంలో జీఎస్టీ సంస్కరణలకు ఆమోదం లభించింది. దీంతో దేశంలో రెండు శ్లాబుల వ్యవస్థ అమలు కాబోతోంది. 5, 18 శాతం మాత్రమే జీఎస్టీ శ్లాబులు ఉంటాయి. అయితే, సైన్ గూడ్స్, లగ్జరీ వస్తువులకు సంబంధించి 40 శాతం ట్యాక్స్ శ్లాబ్ తీసుకొస్తున్నారు. వాటి ధరలు అమాంతం పెరుగుతాయి. కానీ, చాలా వరకు నిత్యావసర వస్తువుల ధరలు దిగివస్తాయని చెప్పవచ్చు. 12, 28 శాతం శ్లాబులను పూర్తిగా తొలగించారు.

### ఐపీఓకు సిద్ధమవుతున్న ఎల్‌జీ ఇండియా




దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఎల్‌జీ ఈ ఏడాదిలోనే అతిపెద్ద ఐపీఓకు సిద్ధమవుతోంది. ఎల్‌జీ కంపెనీ తన ఇండియా యూనిట్ అయిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూను ప్రారంభించనుంది. స్టాక్ మార్కెట్ల నుంచి కంపెనీ సుమారు రూ. 15,000 కోట్ల వరకు నిధులను సమీకరించేందుకు అక్టోబర్ మొదటివారంలో సబ్‌స్క్రిప్షన్ ప్రారంభిస్తుందని బ్యాంక్ వర్గాలు తెలిపాయి. అయితే, ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లు హెచ్చుతగ్గులకు లోనవుతున్న కారణంగా స్థిరమైన పరిస్థితుల కోసం కంపెనీ ఎదురుచూస్తోంది. ఇప్పటికే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఎల్‌జీ ఇండియా పబ్లిక్ ఇష్యూకు ఆమోదం తెలిపింది. కంపెనీ తన ఇండియాలోని 15 శాతం వరకు వాటాను విక్రయించాలని భావిస్తోంది. అంటే ఇది దాదాపు 10.2 కోట్ల షేర్లకు సమానం. గతేడాది అక్టోబర్‌లో హ్యుండాయ్ ఐపీఓ తర్వాత, దేశంలో ఇదే రెండవ అతిపెద్ద ఐపీఓ కానుంది. 2025లో ఇప్పటివరకు దాదాపు 30 ఐపీఓలు రూ. 60,000 కోట్లకు పైగా సేకరించాయి. వీటిలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ. 12,500 కోట్ల ఐపీఓనే అతిపెద్దది. ఎల్‌జీ ఇండియాతో పాటు ఈ ఏడాది టాటా కేపిటల్, అర్బన్ కంపెనీ, బోట్ వంటి ప్రముఖ కంపెనీలు కూడా ఐపీఓ కోసం సిద్ధంగా ఉన్నాయి.

### మలబార్, తనిష్క్, జోయాలుక్కాస్‌లో 22 క్యారెట్ల బంగారం ధర..



బంగారం ధరలు ఇటీవలి కాలంలో భారీగా పెరుగుతున్నాయి. అధిక సుంకాల అనిశ్చితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాల వంటి ప్రధాన కారణాలతో బంగారం రేట్లు రికార్డ్ స్థాయిలో దూసుకెళుతున్నాయి. భారతీయుల విషయానికి వస్తే బంగంరా అంటే కేవలం ఒక పెట్టుబడి మార్గమో, ఒక ఖనిజమో కాదు అంతకు మించి. భారతీయుల సంస్కృతి, సాంప్రదాయాలు, ఉత్సవాలకు బంగారానికి విడదీయరాని బంధం ఉంది. బంగారం ఒక వ్యక్తి సామర్థ్యాన్ని, ఆర్థిక స్థితిని సూచిస్తుంది. దీపావళి, అక్షయ తృతీయ, పెళ్లిళ్లు, కుటుంబ ఉత్సవాల వంటి ప్రత్యేక కార్యక్రమాల్లో బంగారం ఉపయోగిస్తారు. మహిళలు ఆభరణాలుగా ధరిస్తారు. దీంతో మన దేశంలో బంగారానికి ఎప్పుడూ ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఏడాది పొడవునా కొంటూనే ఉంటారు. అయితే, ఇప్పుడు బంగారం ధరలు భారీగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రముఖ జువెలరీ బ్రాండ్స్‌లో సెప్టెంబర్ 8, 2025వ తేదీన 22 క్యారెట్ల బంగారం (ఆభరణాల తయారీ గోల్డ్ ధర) రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. అయితే, ఈ కథనంలో సూచిస్తోన్న నగల తయారీ బంగారం ధరల్లో ఎలాంటి జీఎస్టీ, మేకింగ్ ఛార్జీల వంటివి కలపడం లేదు. ప్రాంతాలను బట్టి పన్నులు, ఛార్జీలు మారుతుంటాయని గమనించాలి. తనిష్క్ జువెలరీలో సెప్టెంబర్ 8, 2025 సోమవారం రోజున సాయంత్రం 5 గంటల ప్రాంతంలో 22 క్యారెట్ల బంగారు నగలకు తులం రేటు రూ. 99,750 వద్ద ఉంది. మలబాహ్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఇవాళ 22 క్యారెట్ల బంగారం ఆభరణాల రేటు తులానికి రూ. 99,850 వద్ద ఉంది. జోయాలుక్కాస్‌లో సెప్టెంబర్ 8వ తేదీన సాయంత్రం బంగారం ధరలు చూస్తే 22 క్యారెట్ల బంగారు నగలు తులానికి రూ. 99,850 వద్ద ఉంది. ముంబై, బెంగళూరు, ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఆన్‌లైన్ స్టోర్స్‌లోనూ ఇదే ధర ఉంది. కల్యాణ్ జువెలర్స్‌లో సోమవారం రోజు సాయంత్రం ఆభరణాల బంగారం (22 క్యారెట్లు) తులానికి రూ. 99,850 వద్ద ఉంది. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్ వంటి ప్రాంతాల్లోనూ ఇదే ధర చూపిస్తోంది.

## స్వల్ప లాభాలతో ముగిసిన దేశీయ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభనష్టాల మధ్య తీవ్రంగా ఊగిసలాడాయి. ఉదయం భారీ లాభాలతో కళకళలాడిన సూచీలు, ట్రేడింగ్ చివరి గంటలో అమ్మకాల ఒత్తిడికి గురై నామమాత్రపు లాభాలతో ముగిశాయి. ఆటో, మెటల్ రంగ షేర్లలో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించగా, ఐటీ దిగ్గజ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడం మార్కెట్లను కిందకు లాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 76.54 పాయింట్లు లాభపడి 80,787.30 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 32.15 పాయింట్లు పెరిగి 24,773.15 వద్ద ముగిసింది. జీఎస్టీ సంస్కరణల ప్రకటన, ఆటోమొబైల్ కంపెనీలు వడ్డీ రేట్లను తగ్గించడం వంటి సానుకూల అంశాలతో ఉదయం సెషన్ ఆరంభంలో సెన్సెక్స్ ఏకంగా 400 పాయింట్లకు పైగా ఎగబాకి, రోజులో 81,171.38 గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే, చివరి




గంటలో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ఆ లాభాలన్నీ దాదాపుగా ఆవిరయ్యాయి."తగ్గినప్పుడు కొనుగోలు, పెరిగినప్పుడు అమ్మకాలు అనే వ్యూహాన్ని మదుపరులు అనుసరిస్తున్నారని, మార్కెట్ ఆరంభ లాభాలను నిలబెట్టుకోలేకపోవడానికి ఇదే కారణం" అని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ విశ్లేషించారు. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో డిమాండ్ పెరుగుతుందన్న అంచనాలతో ఆటో షేర్లు ర్యాలీ చేశాయని, అయితే అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల కారణంగా ఐటీ రంగం బలహీనంగా ఉందని ఆయన తెలిపారు. సెన్సెక్స్ షేర్లలో టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు, ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, టీసీఎస్, సన్ ఫార్మా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ ఆటో సూచీ 3.30 శాతం మేర దూసుకెళ్లగా.. నిఫ్టీ ఐటీ సూచీ దాదాపు 1 శాతం మేర పతనమైంది. బ్రాడర్ మార్కెట్లలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి.

## స్పోర్ట్స్

# ఆల్‌టైమ్ ఆసియా టీ20 జట్టు: భారత్ నుంచి ఐదుగురు.. యువీకి నో ఛాన్స్

ఆసియా కప్- 2025 టోర్నీకి రంగం సిద్ధమైంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా సెప్టెంబరు 9- 28 వరకు టీ20 ఫార్మాట్లో ఈసారి ఈ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. భారత్ ఆతిథ్య దేశంగా వ్యవహరించనుండగా.. టీమిండియాతో పాటు శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్, ఒమన్, యూఏఈ, హాంకాంగ్ ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి.

**భారత్ నుంచి ఐదుగురు**

ఇందుకోసం ఇప్పటికే ఎనిమిది జట్లు యూఏఈకి చేరుకుని.. అన్ని విధాలా సన్నద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ బ్రెట్ లీ.. ఆసియా ఉత్తమ టీ20 జట్టును ఎంచుకున్నాడు. ఇందులో ఐదుగురు టీమిండియా స్టార్లకు చోటిచ్చిన ఈ ఆసీస్ దిగ్గజం.. బంగ్లాదేశ్ నుంచి ఒక్కరిని కూడా ఎంపిక చేయలేదు.

**యూఏఈ నుంచి ఇద్దరు**

అయితే, అనూహ్యంగా యూఏఈ నుంచి ఇద్దరు.. హాంకాంగ్ నుంచి ఒక ఆటగాడికి బ్రెట్ లీ తన జట్టులో చోటివ్వడం విశేషం. ఇక పాకిస్తాన్ నుంచి ఇద్దరిని ఎంచుకున్న బ్రెట్ లీ... స్పిన్ విభాగంలో శ్రీలంక, అఫ్గనిస్తాన్ ప్లేయర్లకు అవకాశం




ఇచ్చాడు. అయితే, బ్రెట్ లీ ఎంచుకున్న జట్టులో టీమిండియా టీ20 ప్రపంచకప్ విజేతలు యువరాజ్ సింగ్ (2007), సూర్యకుమార్ యాదవ్ (2024)లకు మాత్రం చోటు ఇవ్వకపోవడం గమనార్హం.

**ధోని, రో- కో తమకు తామే సాటి**

ఐసీసీ తొలిసారి ప్రవేశపెట్టిన పొట్టి క్రికెట్ ప్రపంచకప్ గెలిచిన కెప్టెన్‌గా ధోని పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. 2007లో భారత్ వరల్డ్‌కప్ గెలవడంలో యువీది కూడా కీలక పాత్ర. ఇక అంతర్జాతీయ టీ20 ఫార్మాట్లో అత్యధిక రన్‌స్కోరర్ రోహిత్ శర్మ (4231 పరుగులు). ఇక మూడో స్థానంలో విరాట్ కోహ్లి (4188) ఉన్నాడు. 2024లో కెప్టెన్‌గా రోహిత్ పొట్టి ప్రపంచకప్ గెలవగా.. కోహ్లి ఖాతాలో మరో టైటిల్ చేరింది. వీరితో పాటు హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా కూ డా టీమిండియాను చాంపియన్‌గా నిలపడంలో తమ వంతు పాత్ర పోషించారు. ఈ టోర్నీ తర్వాత రోహిత్- కోహ్లి.. ఇద్దరూ అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించారు

**బ్రెట్ లీ ఎంచుకున్న ఆసియా ఆల్‌టైమ్ టీ20 ప్లేయింగ్ ఎలెవన్**

విరాట్ కోహ్లి (ఇండియా), రోహిత్ శర్మ (ఇండియా), మొహమ్మద్ రిజ్వాన్ (పాకిస్తాన్), బాబర్ హయత్ (హాంకాంగ్), మహేంద్ర సింగ్ ధోని (ఇండియా), హార్దిక్ పాండ్యా (ఇండియా), వనిందు హసరంగ (శ్రీలంక), రషీద్ ఖాన్ (అఫ్గనిస్తాన్), అమ్జద్ జావేద్ (యూఏఈ), మొహమ్మద్ నవీద్ (యూఏఈ), హ్యారిస్ రవూఫ్ (పాకిస్తాన్), జస్‌ప్రీత్ బుమ్రా (ఇండియా).

## వారిద్దరిని మిస్ అవ్వడం లేదు..అన్నింటికీ మేము రెడీ: పాక్ కెప్టెన్

ఆసియాకప్-2025కు రంగం సిద్ధమైంది. అబుదాబి వేదికగా మరి కొన్ని గంటల్లో అఫ్గానిస్తాన్-యూఏఈ మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. అయితే ఈ ఖండాంతర టోర్నమెంట్ ఆరంభానికి ముందు మొత్తం 8 జట్ల కెప్టెన్‌లు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజం, మహ్మద్ రిజ్వాన్ జట్టులో లేకపోవడం తమకు ఎటువంటి నష్టం కలిగించదు సల్మాన్ చెప్పుకొచ్చాడు. కాగా గత కొంత కాలంగా బాబర్, రిజ్వాన్ పేలవ ప్రదర్శన కనబరుస్తుండడంతో ఆసియాకప్‌కు సెలక్టర్లు చేయలేదు. సెలక్టర్ల నిర్ణయాన్ని చాలా మంది తప్పు బట్టారు. కాగా ఇటీవల కాలంలో పాక్ ఈ ఇద్దరు దిగ్గజ క్రికెటర్లు లేకుండా ఓ మల్టీనేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొంటుండడం ఇదే తొలిసారి "ప్రస్తుతం మా జట్టు చాలా బాగుంది. గత నాలుగు సిరీస్‌లలో మేము మూడింట మేము విజయం సాధించాము. అన్ని విభాగాల్లోనూ మేము మెరుగ్గా




రాణిస్తున్నాము. ఏదేమైనప్పటికి ఆసియాకప్ మాకు ఒక కఠిన సవాల్ వంటిది. ఎందుకంటే మా జట్టులో చాలా మంది ఆటగాళ్లు తొలిసారి ఒక ప్రధాన టోర్నమెంట్‌లో ఆడనున్నారు. ఈ సవాల్‌ను ఎదుర్కొనేందుకు మేము సిద్ధంగా ఉన్నాము. టీ20 క్రికెట్‌లో ఏ జట్టు ఫేవరేట్ కాదు. తమదైన రోజున ప్రతీ జట్టు అద్బుతాలు చేస్తోంది. ఒకట్రెండు ఓవర్లలో మ్యాచ్ స్వరూపమే మారిపోతుంది. ఈ టోర్నీకి ముందు ముక్కోణపు సిరీస్‌ను మేము సన్నాహకంగా ఉపయోగించుకున్నాము. సిరీస్‌ను గెలిచినందుకు సంతోషంగా ఉన్నాము" అని సల్మాన్ పేర్కొన్నాడు. కాగా ఈ మల్టీనేషన్ టోర్నమెంట్‌కు ముందు పాక్ జట్టు యూఏఈ, అఫ్గానిస్తాన్‌లతో ట్రైసిరీస్‌లో తలపడింది. ఫైనల్లో అఫ్గానిస్తాన్‌ను చిత్తు చేసి పాక్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు అదే జోరును ఆసియాకప్‌లోనూ కనబరిచాలని మెన్ ఈన్ గ్రీన్ భావిస్తుంది. ఈ ఖండాంత టోర్నీలో పాక్ జట్టు తమ తొలి మ్యాచ్‌లో సెప్టెంబర్ 12న ఒమన్‌తో తలపడనుంది. అనంతరం సెప్టెంబర్ 14న టీమిండియాతో అమీతుమీ తెల్చుకోనుంది.

**పాకిస్తాన్ జట్టు**

సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, హారీస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ తలాత్, ఖుష్దిల్ షా, మహ్మద్ హారీస్ (వికెట్-కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీమ్ జూనియర్, సాహిబ్‌జాదా ఫర్హాన్, సయీమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహిన్ అఫ్రిది, సూఫియాన్ మొకిమ్

### ఆసియాకప్‌లో ఫేవరేట్ ఎవరు? ఆ ప్రశ్నకు సూర్య, సల్మాన్ ఏం చెప్పారంటే




దుబాయ్: ఆసియాకప్ టోర్నీ నేటి నుంచి ప్రారంభం అవుతోంది. ఈ నేపథ్యంలో ఆరు జట్లకు చెందిన కెప్టెన్లతో మీడియా సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో ఓ జర్నలిస్టు టోర్నమెంట్ ఫేవరేట్ ఎవరన్న ప్రశ్న వేశారు. ఆసియా కప్ టోర్నీ టైటిల్‌కు ఇండియా ఫేవరేట్‌గా ఉందన్న విషయం నిజమేనా అని ఆయన ప్రశ్న వేశారు. దానికి భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తో పాటు పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా కూడా స్పందించారు. అయితే సూర్య తన సమాధానంతో అందర్నీ స్టన్ చేశాడు. కిస్నే బోలా.. మీకెవరు చెప్పారు.. నేనెప్పుడు వినలేదని అన్నాడు. నాలుగు రోజుల క్రితమే దుబాయ్‌కు చేరుకున్నామని, టోర్నీ గెలవాలన్న కాన్ఫిడెంట్‌తో ఉన్నామని, జట్టుకు మంచి గుర్తింపు వచ్చిందని, టోర్నీలో రాణించనున్నట్లు అతను చెప్పాడు. ఫేవరేట్స్ ఎవరన్న ప్రశ్నకు పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా కూడా స్పందించారు. టీ20 క్రికెట్‌లో ఏ జట్టు కూడా ఫేవరేట్‌గా ఉండదన్నారు. ఎందుకంటే ఆట విధానమే అలా ఉంటుందన్నారు. ఇది ఫాస్ట్ పేస్ గేమ్ అని, కొన్ని ఓవర్లలో మ్యాచ్ స్వరూపం మారిపోతుందని సల్మాన్ అన్నాడు. యూఏఈ, ఆఫ్ఘనిస్తాన్‌తో ఇటీవల జరిగిన ట్రై సిరీస్‌లో పాకిస్థాన్ విజేతగా నిలిచింది. ఆసియాకప్‌ను గెలవకుంటే, ట్రై సిరీస్ గెలిచి లాభం లేదని సల్మాన్ తెలిపాడు.

# తెరపైకి నితిన్ - శ్రీను వైట్ల కాంబినేషన్



వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న టాలీవుడ్ స్టార్ హీరో నితిన్, దర్శకుడు శ్రీన్ వైట్ల కలిసి ఒక సినిమా చేయబోతున్నట్లు వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గత కొన్ని రోజులుగా వీరిద్దరికి సరైన హిట్లు పడలేదన్న విషయం తెలిసిందే. 2016 నుంచి 2025 మధ్య నితిన్ నటించిన సినిమాలలో భీష్మ మాత్రమే మంచి విజయాన్ని అందుకుంది. ఇటీవల భారీ అంచనాలతో వచ్చిన తమ్ముడు చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. దీంతో నితిన్ తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయితే ఈ సమయంలోనే కెరీర్ పరంగా కీలక నిర్ణయం తీసుకోవాల్సిన టైంలో కొన్ని సంవత్సరాలుగా సరైన హిట్ లేని దర్శకుడు శ్రీను వైట్లతో జతకట్టబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి కలయికలో రాబోతున్న సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుందని తెలుస్తోంది. శ్రీను వైట్ల విషయానికొస్తే బాద్‌షా తర్వాత ఆయన నుంచి వచ్చిన ఏ సినిమా కూడా ఆశించిన విజయం సాధించలేకపోయింది. ఇటీవల ఆయన రూపొందించిన విశ్వం చిత్రం కూడా పర్వాలేదనిపించినా కమర్షియల్‌గా సక్సెస్ కాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కాంబినేషన్ నిజంగానే కార్యరూపం దాల్చుతుందా లేదా అనేది ఇంకా క్లారిటీ లేదు.



# పీటర్ హెయిన్ టీంతో యాక్షన్ షెడ్యూల్.. సాయి దుర్గ తేజ్ షెడ్యూల్ ఇదే

టాలీవుడ్‌లో మంచి ఫ్యాన్ బేస్ ఉన్న యాక్టర్లలో ఒకడు సాయి దుర్గ తేజ్. ఈ క్రేజీ యాక్టర్ నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం సంబరాల యేటి గట్టు రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కే నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. రూ.125 కోట్ల బడ్జెట్‌తో భారీ స్థాయిలో తెరకెక్కుతోంది. ఇటీవలే కార్మికుల వేతన సమస్యపై ఇండస్ట్రీ బంద్ ప్రకటించిన నేపథ్యంలో షూటింగ్ నిలిచిపోయింది. అయితే తాజా కథనం ప్రకారం ఈ మూవీ చిత్రీకరణ మళ్లీ మిడ్ సెప్టెంబర్‌లో మొదలు కానుంది. పాపులర్ యాక్షన్ కొరియోగ్రఫర్ పీటర్ హెయిన్స్ పర్యవేక్షణలో యాక్షన్ సీక్వెన్స్‌తో ఈ షెడ్యూల్ మొదలు కానుందన్న వార్త ఇప్పుడు నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఖరీదైన సెట్స్‌లో విదేశీ ఫైటర్లతో సాయిధరమ్ తేజ్ యాక్షన్ పార్ట్‌ను షూట్ చేయనున్నారట. ఈ సీక్వెన్స్ తర్వాత విలన్‌గా నటిస్తున్న ఓ బాలీవుడ్ సూపర్ స్టార్ కాంబినేషన్, సాయి దుర్గతేజ్‌తో వచ్చే క్లైమాక్స్ షూట్ ఉండబోతున్నట్టు సమాచారం. ఈ రెండు యాక్షన్ ప్యాక్‌డ్ షెడ్యూల్స్‌తో షూటింగ్ మొత్తం పూర్తి కానుందట. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సీజీఐ, వీఎఫ్ఎక్స్ పనులు జెట్‌స్పీడ్‌లో సాగుతున్నాయి. ప్రేక్షకులకు అన్ని ఫార్మాట్లలో వినోదాన్ని అందించేలా సినిమాను రెడీ చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రంలో సాయి దుర్గ తేజ్ ఇదివరకెన్నడూ కనిపించని అత్యంత పవర్ ఫుల్ రోల్‌లో కనిపించబోతుండగా.. ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకున్నాడని టాక్. ఎస్‌వైజీలో ఐశ్వర్య లక్ష్మి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. జగపతిబాబు, శ్రీకాంత్, సాయికుమార్, అనన్య నాగళ్ల, రవి కృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళంలో విడుదల కానుంది. రిలీజ్ డేట్‌పై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్.




# తేజ సజ్జా మిరాయ్.. సెన్సార్ బోర్డ్ ఏ సర్టిఫికేట్ ఇచ్చిందంటే?

హనుమాన్ మూవీతో పాన్ ఇండియా క్రేజ్ దక్కించుకున్న హీరో తేజ సజ్జా. ప్రస్తుతం యాక్షన్-ఫాంటసీ చిత్రం 'మిరాయ్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా.. అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. ఈ మూవీలో టాలీవుడ్ హీరో మంచు మనోజ్ విలన్ రోల్‌లో కనిపించనున్నారు. తాజాగా మిరాయ్ సెన్సార్ బోర్డ్ సర్టిఫికేషన్ పూర్తి చేసుకుంది. ఈ ?సినిమాకు యూ/ఏ సర్టిఫికేషన్ వచ్చినట్లు హీరో తేజ సజ్జా ట్వీట్ చేశారు. పిల్లలతో కలిసి ఫ్యామిలీ ఈ మూవీని ఎంజాయ్ చేయండని పోస్ట్ చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా యాక్షన్, ఎమోషన్, భక్తి ఉండే చిత్రమని రాసుకొచ్చారు. కాగా.. ఈ సినిమా సెప్టెంబర్ 12న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా మెప్పించనుంది. అంతేకాకుండా శ్రియా శరణ్, జయరామ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది భాషల్లో విడుదల చేయనున్నారు. 2డీతో పాటు 3డీ ఫార్మాట్‌లో రిలీజవుతోంది.



# రోషన్ 'ఛాంపియన్'లో మలయాళీ బ్యూటీ అనస్వర రాజన్

హీరో శ్రీకాంత్ తనయుడు రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఛాంపియన్. ఈ సినిమాకు ప్రదీప్ అద్వైత్ దర్శకత్వం వహిస్తుండగా.. స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ కాన్సెప్ట్ బ్యానర్లు ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అయితే ఈ చిత్రం నుంచి కథానాయికను పరిచయం చేశారు మేకర్స్. ఈ సినిమాలో మలయాళ యంగ్ బ్యూటీ అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. చంద్రలేఖ పాత్రలో అనస్వర నటించబోతుండగా.. కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఇందులో రోషన్ ఫుట్‌బాల్ ఆటగాడిగా కనిపించబోతున్నాడు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.